

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.22 మంగళవారం సాయంత్రం
సహారి: 4.49 బుధవారం ఉదయం

లారీ ట్యాంకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆత్మహత్య 7



అన్నవరం సత్యదేవా హైస్కూల్‌లో హాల్‌టిక్కెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



కాకినాడ రాజీవ్‌గాంధీ కార్పొరేషన్ హైస్కూల్‌లో..

టెన్త్.. మొదలైంది

- ప్రశాంతంగా పదో తరగతి తొలిరోజు పరీక్షలు
- జిల్లాలో 27,368మంది విద్యార్థులు హాజరు

ఉరుకులు.. పరుగులతో పొద్దున్నే హడావుడిగా పరీక్షాకేంద్రానికి చేరుకున్నవాళ్లు కొందరు.. తమ పిల్లలకు పదేపదే జాగ్రత్తలు చెప్తున్న తల్లిదండ్రులు.. ఆల్‌దిబెస్ట్.. బెస్ట్‌ఆఫ్‌లక్‌లు.. మా రూం ఎక్కడ అంటూ ఆతృతతో హాల్‌టిక్కెట్లు తీసుకుని నెంబర్లు వెతుకున్న విద్యార్థులు.. ఈ దృశ్యాలన్నీ సోమవారం ఉదయం పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్ద తారసపడ్డాయి. టెన్త్ పరీక్షలు మొదలయ్యాయి. అంటే తల్లిదండ్రులకు కూడా పరీక్షలు మొదలైనట్లే..!

కాకినాడరూరల్, మార్చి17(ఆంధ్రజ్యోతి): పదోతరగతి తొలిరోజు పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు.ఉదయం 9.30గంటలనుంచి12.45 గంటల వరకూ జరిగిన తెలుగు, కాంపోజిట్ తెలుగు పేపర్-1 పరీక్షలకు జిల్లాలో మొత్తం 27,592మంది హాజరు కావాల్సి ఉండగా 27,368మంది విద్యార్థులు హాజరయ్యారని 224మంది పరీక్ష రాయలేదన్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ ఒక పరీక్షా కేంద్రాన్ని, ఆర్జేడీ జి.నాగమణి 7, డీఈవో 5, అసిస్టెంట్ కమిషనర్ 4, తనిఖీ అధికారులు 41 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా 142 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. కాకినాడ డివిజన్‌లో 16,607మంది విద్యార్థులకుగాను 16,488 హాజరుకాగా 119మంది హాజరుకాలేదని, పెద్దాపురం డివిజన్‌లో 10,985మంది విద్యార్థులకుగాను 10,880మంది హాజరు కాగా 105మంది పరీక్షరాయలేదన్నారు. 19న సెకండ్ లాంగ్వేజ్ జరుగుతుందన్నారు.



గొల్లప్రోలులో హాల్‌టిక్కెట్ నెంబర్లు వెదుకుతున్న విద్యార్థులు



తొండంగి మండలం బెండపూడిలో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థినులు

సముద్ర కోత నివారించి..

తీర గ్రామాలను కాపాడండి

- ఉప్పాడ తీరంలో సముద్రకోతపై శాసనమండలిలో జనసేన ఎమ్మెల్సీ ప్రసంగం

కొత్తపల్లి,మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సముద్ర తీరప్రాంత సమస్యలపై శాసనమండలిలో సోమవారం జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ సుదీర్ఘంగా ప్రసంగించారు. నియోజకవర్గంలో ఐదు తీరప్రాంత గ్రామాలు సముద్రంలో కోతకు నానాటికీ గురవుతున్నాయని, 1989నుంచి 1.3మీటర్లు సముద్రం గ్రామాలను నాశనం చేసుకుంటూ ముందుకు వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 13 కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన గ్రామాలు క్రమేపీ సముద్రంలో కలిసిపోతున్నాయన్నారు. సముద్ర కోత నివారణకు జాతీయ తీర ప్రాంత అభివృద్ధి సంస్థ రూ.230కోట్ల వ్యయంతో టెట్రావాల్ నిర్మాణం చేపట్టాలని గతంలోనే సూచించిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఒక డీపీఆర్ రూపకల్పన చేసి ఇప్పటికే కేంద్రానికి సమర్పించిందన్నారు. ప్రస్తుతం ఆ నివేదిక సలహా కమిటీ ఆధ్వర్యంలో ఉందన్నారు. ఈ కమిటీ ఆ నివేదికలను ఆమోదాలను తెలియజేసి సముద్ర కోతకు గురవుతున్న తీరప్రాంతాలను కాపాడాలని కోరారు.

అన్నవరం-బాపట్ల మధ్య కోస్టల్ రైల్వే కారిడార్

ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

- కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్(కాకినాడ),మార్చి17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నవరంనుంచి బాపట్ల వరకు కోస్టల్ రైల్వే కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. సోమవారం లోక్‌సభలో రైల్వేశాఖ డిమాండ్స్ ఫర్ గ్రౌండ్స్‌పై జరిగినచర్చలో భాగంగా ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడారు. ఏపీ నుంచి 947 కి.మీ. సుదీర్ఘ తీరప్రాంతం భారీ ఎగుమతులతో ప్రధాన పోర్టులు ఉన్నా రైల్వే కారిడార్ లేకపోవడంవల్ల వాణిజ్యం, లాజిస్టిక్స్ తోపాటు ప్రాంతీయ పోర్టుల అనుసంధానంలో ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. కాకినాడ, మచిలీపట్నం, నిజాంపట్నం ఓడల రేవులను అనుసంధానం చేస్తూ త్వరితగతిన కోస్టల్ కారిడార్ ఏర్పాటు చేస్తే సరుకు రవాణా సులభతరం అవ్వడంతోపాటు వ్యవసాయరంగం, సీఫుడ్స్ ఎగుమతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేంద్రం విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటు చేయడంతోపాటు రాజధాని అమరావతికి కొత్త రైల్వేలైన్, రైల్వే బడ్జెట్లో ఏపీకి అత్యధికంగా రూ.9,417కోట్లు కేటాయింపులు చేయడంపట్ల ఎంపీ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రరైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రైవేటుకు.. ఫిట్‌నెస్!

జిల్లాకో ఏటీఎస్ కేంద్రం ఏర్పాటు

- 3 జిల్లాలు 3 కేంద్రాలు
- తూర్పునకు రాజానగరం
- కాకినాడకు వాకలపూడి
- నెలాఖరుకు కోనసీమలో
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇక ప్రైవేటు
- ఆర్టీఏ కార్యాలయాలకు దూరం
- ఏ జిల్లా వాహనాలు అక్కడే
- రోజుకు 50 వాహనాల టెస్ట్‌లు
- సర్కారు ఆదాయానికి గండి
- రెండేళ్ల వరకూ ప్రైవేటు జేబు ఫుల్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వాహనాల ఫిట్‌నెస్‌కు ఇక ఆర్‌టీవో అధికారుల చుట్టూ తిరగాల్సిన పనేలేదు.. ఎందుకంటే వాహనాల ఫిట్‌నెస్ బాధ్యతను ప్రైవేట్‌కు అప్పగించారు. కేంద్ర రవాణా శాఖ ఆదేశాలతో జిల్లాకు ఒక ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)ను శాంక్షన్ చేసింది. రాజమహేంద్రవరం, కాకినాడ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి సీటీఆర్‌ఎల్ ఆల్ట్‌ఫిక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టెండరు దక్కింది. ఆ సంస్థ ఐదు జిల్లాల్లో శుక్రవారం నుంచి వీటిని ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీలోపు అన్ని జిల్లాల్లో ఈ స్టేషన్లు పనిచే యనున్నాయి. ఆయా జిల్లాల్లో ప్రజలకు సంబంధించిన లైట్ మోటారు వెహికిల్స్, హెవీ మోటార్ వెహికిల్స్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఈ సంస్థ మాత్రమే ఇస్తుంది. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజానగరం, కాకినాడ జిల్లాకు సంబంధించి వాకలపూడిలో ఏర్పాటు చేశారు. ఇక కోనసీమ జిల్లాలో ఈ నెలాఖరుకు ఏర్పాటు చేయనున్నారు. ఇంతవరకూ ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫై చేసేవారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే ఆయా వాహనాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం చలానా కట్టించుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేవారు. ఈ పనులన్నీ ఇకపై ఈఏటీఎస్‌లో జరుగుతాయి.

ప్రైవేటీకరణ ఎందుకు?

ఫిట్‌నెస్ సర్టిఫై ప్రైవేటీకరణ చేయడం వల్ల ఉపయోగం ఏంటి? ఎందువల్ల రవాణా శాఖ నుంచి ఈ విధులను తప్పించారనేదానికి సమాధానం లేదు. ఆర్టీఏ అధికారులకు ఏ విధమైన సమాచారం లేదని చెప్పడం గమనార్హం. అవినీతి తగ్గించాలని ప్రైవేటీకరించారా.. లేదా ఎక్కువ ఆదాయం కోసం అమలుచేస్తున్నారా, ఫిట్‌నెస్‌లో లోపాలు ఏమైనా బాగుపడతాయని చూస్తున్నారా అనేది తెలియడంలేదు. వాహనాలు ఫిట్‌నెస్ సరిగ్గా లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. నిజాయితీగా ఈ టెస్టులు నిర్వహిస్తే మేలే. ప్రైవేట్ బస్సులు, కార్లు, క్యాబ్‌లు, ట్రాక్టర్లు, లారీలు, గూడ్స్ వాహనాలు, ట్యాంకర్లు, స్కూల్ బస్సులు వంటివన్నీ ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకోవాలి. పసుపు నెంబరు బోర్డులు ఉంటే ట్రాన్స్‌పోర్టు, తెలుసు నెంబరు ప్లేట్లు ఉంటే నాన్- ట్రాన్స్‌పోర్టు వాహనాలుగా పరిగణిస్తారు. కొత్త వాహనానికి లైఫ్‌టైమ్‌లో మొదటి 8 ఏళ్లలో ప్రతి రెండేళ్లకో సారి ఫిట్‌నెస్ టెస్ట్ చేయించాలి. 8 ఏళ్ల తర్వాత ఏడాదికోసారి టెస్ట్ చేయించాలి. 15 ఏళ్లకు కండిషన్ చూసి ఆపేయాలి. స్కూల్ బస్సులకు కేవలం 15 ఏళ్ల వరకే ఫిట్‌నెస్ చూస్తారు. తర్వాత వాటిని స్కూల్ బస్సుల కింద వాడకూడదు.గతంలో జిల్లాలో వాహనాల ఫిట్‌నెస్ రాజమహేంద్రవరం, కొవ్వూరు ఆర్టీవో కార్యాలయాల్లో నిర్వహించేవారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని వాహనాలు రాజానగరం కల్వచర్ల ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)కు రావాల్సిందే.

అవినీతిని కొనసాగిస్తారా..

గతంలో ఆర్టీవో కార్యాలయాల్లో ఫిట్‌నెస్‌కు ప్రభుత్వ చలానాతోపాటు అదనంగా వసూలు చేసిన అవినీతి సొమ్మును ఈ కొత్త విధానంలో కూడా వసూలు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. రాజానగరంలోని ఏటీఎస్‌లో అక్కడి నిర్వాహకుడు ఒకరు జిల్లాలోని ఆర్టీఏ ఏజెంట్లను పిలిచి సుమారు గంట సేపు సమావేశం నిర్వహించడం గమనార్హం. గతంలో ఎలా అయితే వాహనదారుల నుంచి అదనంగా వసూలు చేసి అధికారులకు ఇచ్చేవారో.. అలాగే తమకు కూడా ఇవ్వాలని, అపుడే మీ కమీషన్ మీకు వస్తుందని స్పష్టంచేసినట్టు సమాచారం. త్వరలో రవాణా అధికారులతో కూడా తాము లోపాయికారిగా ఒప్పందం పెట్టుకుంటామని చెప్పినట్టు సమాచారం. దీనిపై ఏజెంట్లు స్పందించి ఒక నెల తమకు గడువు ఇస్తే తర్వాత ఎలా చేయమంటే అలా చేస్తామని కూడా చెప్పినట్టు సమాచారం. ఇదిలా ఉండగా గతంలో రవాణా శాఖ అధికారులు వసూలు చేసిన జాబితా ఒకటి బయటకు రావడం గమనార్హం.

రెండేళ్ల ఆదాయం జేబుల్లోకే!

సాధారణంగా వాహనాల ఫిట్‌నెస్ వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.కోట్ల ఆదాయం వచ్చేది. జిల్లాలో వేలాది వాహనాలు ఉన్నాయి. కేంద్ర ట్రాన్స్‌పోర్టు ఇండియా సలహా మేరకు ఏటీఎస్‌లు రెండేళ్లపాటు వాహనాల నుంచి ఫిట్ నెస్ టెస్ట్ కోసం వసూలు చేసిన సొమ్మంతా సొంతానికి వినియోగించుకోవచ్చు. ప్రభుత్వానికి ఒక పైసా కూడా చెల్లించనవసరం లేదు. ఇది టెండర్ విధానంలో పెట్టిన నిబంధనగా చెబుతున్నారు. ఒక్కో ఏటీఎస్‌కు ఖర్చు రూ.4.5 కోట్లు అవుతుందని నిర్వాహకుల కథనం. ప్రతి స్టేషన్‌లో మిషనరీతోపాటు 21 మంది సిబ్బంది ఉంటారు. ప్రభుత్వం గతంలో వసూలు చేసిన చలానా కంటే రూ.200కు పైగా పెంచినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం ఏటీఎస్ చలానా ధరల ప్రకారం లైట్ మోటారు వెహికల్ కేటగిరీకి అంటే ఆటో నుంచి మొదలు మిగతా అన్నింటికి ఫిట్‌నెస్ పరీక్షకు రూ.860 వసూలు చేయాలి. హెవీ మోటారు వెహికిల్స్‌కు రూ.1320 వసూలు చేయాలి. రోజుకు ఒక్కో స్టేషన్‌లో 50 వాహనాలకు టెస్ట్‌లు చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు.

డయల్ యువర్ డీఎంకి పలు వినతులు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపోలో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరిగింది. ఆయనకు పలువురు వినతులు తెలిపారు. కాకినాడనుంచి పొద్దుటూరుకు బస్సును వయా ఒంగోలు, కడప మీదుగా నడపాలని కోరారు. కాకినాడ పట్టణంలో అద్దె బస్సుల డ్రైవర్లు బస్సులను రోడ్డు మధ్యలో ఆపి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడప్రభుత్వాస్పత్రివద్ద బస్టాప్ ఉన్నందున కోర్టు టర్నింగ్‌లో ఉన్న స్టాప్ ఎత్తివేస్తే ట్రాఫిక్‌కుఅంతరాయం లేకుండా ఉంటుందని ఒకరు సూచించారు.కుళాయి చెరువు హైటెక్ బస్టాండ్‌వద్దస్టాప్ ఉండగా మూడు లైన్లు జంక్షన్‌వద్ద స్టాప్ ఎం దుకని దాన్ని తీసివేయాలని కొందరు కోరారు. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఎం మనోహర్ తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన జేఎన్టీయూకే వీసీ

- విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకల నిర్వహణపై చర్చ 6



సత్యనికేతన్ సత్రం వ్యవహారంపై ఈవోను కలిసిన డీఎస్పీ, సీఐ 6
ఇష్టారాజ్యంగా వాహనాల నెంబర్ల ప్లేట్లపై రాతలు 6
భర్త వేధింపులు తాళలేక.. కాకినాడలో వివాహిత ఆత్మహత్య 7
సత్యదేవుడి మూలవిరాట్‌ను చిత్రీకరించిన యూట్యూబ్ చానెల్‌పై కేసు మెయిన్‌లో..

సేంద్రియ ఉత్పత్తులండి..

రండమ్మా.. రండి!

- కాకినాడ కలెక్టరేట్‌లో ప్రకృతి ఉత్పత్తుల విక్రయాల స్టాల్
- ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు
- ప్రతి సోమవారం నేరుగా రైతుల ద్వారానే అమ్మకాలు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తుల విక్రయాల స్టాల్స్

కలెక్టరేట్(కాకినాడ),మార్చి17(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన సేంద్రియ ఉత్పత్తుల స్టాల్ ప్రారంభమైంది. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా 6500 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. వరి, కూరగాయలు, అపరాలు, బొప్పాయి, ఆకుకూరలు, కొర్రలు, అరిసెలు వంటి ఎన్నో ఉత్పత్తులను రైతులు పండిస్తున్నారు. అలా పండించిన ఉత్పత్తులను కాకినాడ కలెక్టరేట్‌లో స్టాల్స్ పెట్టి రైతులే విక్రయిస్తున్నారు. సోమవారం ఉదయం 9గంటలనుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ ఉత్పత్తులను విక్రయించారు. కిలో టమాట రూ.30, వంకాయ రూ.50, బెండకాయ రూ.50, పచ్చిమిర్చి రూ.50, చిక్కుడు కాయలు రూ.80 కాగా.. పాలకూర రూ.30, తోటకూర రూ.30, గోంగూర రూ.30 ఇలా అనేక రకాల కూరగాయలతోపాటు ఆకుకూరలు కూడా విక్రయిస్తున్నారు. క్రిమిసంహారక మందులు వినియోగించకుండా గోఆధారిత ఆవుపేడ, ఆవు మూత్రంతో తయారు చేసిన ద్రవ, ఘన జీవామృతంతో రైతులు సేద్యం చేశారు. జిల్లాలో చాలామంది సేంద్రీయ ఉత్పత్తులకు పెద్ద పీట వేస్తున్నారు. ఈ తరుణంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు వీటిని కొనుగోలు చేశారు.

త్వరలో రైతుబజార్లలో..

-దేవి, ప్రకృతి వ్యవసాయం మార్కెటింగ్ ప్రతినిధి

ప్రస్తుతం జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరిగే ప్రభుత్వ కార్యలయాల్లో ఈ ఉత్పత్తులు అమ్ముతున్నాం. త్వరలో జిల్లాలో అన్ని రైతుబజార్లలో ఏర్పాటు చేస్తాం.

ఆరోగ్యానికి ఎంతో మేలు

- పెంకే సత్య, రైతు, కరప మండలం

ప్రకృతి వ్యవసాయంలో పంట ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉంటుంది. గోఆధారిత సేంద్రీయ పద్ధతిలో సాగు చేయడంవల్ల నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు వస్తాయి. వీటిలో క్రిమి సంహారక అవశేషాలు లేకపోవడంవల్ల ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

చేతివాటం!



- నాడు-నేడు పాఠశాల అభివృద్ధి పనుల్లో నిధుల గోల్‌మాల్
- కాకినాడ ముత్తానగర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ స్కూల్‌కు రూ.2.93కోట్ల మంజూరు
- నిర్మాణ పనులు జరిగింది మాత్రం రూ.కోటిలోపే
- జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఫిర్యాదులు

పాఠశాలలో అసంపూర్తిగా మిగిలిన అదనపు తరగతి గదుల నిర్మాణం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని.. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో చేపట్టిన నాడు-నేడు పనులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేదు. కాకినాడ నగరంలో చాలా పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా మిగలడమే ఇందుకు నిదర్శనం.నిధులను సకాలంలో ఖర్చుచేయక కొన్నిచోట్ల పనులు నిలిచిపోతే.. కొన్నిచోట్ల చేతివాటంతో మొండిగోడలే కనిపిస్తున్నాయి.

కాకినాడ జగన్నాథపురం శివారు ముత్తానగర్‌లోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన 'నాడు-నేడు' పనుల్లో భారీగా అవినీతి జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.2.5కోట్లకు పైగా బడ్జెట్ అంచనాలతో ఇక్కడ పనులు చేపట్టగా.. అసంపూర్తిగా నిలిచిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ హైస్కూల్‌లో 2022-23, 2023-24లో రూ.2కోట్ల93లక్షలతో 'మనబడి నాడు నేడు' పనులు చేపట్టారు. 2023, ఏప్రిల్ 5న వీటికి శంకుస్థాపన చేశారు. మూడు అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, స్టేజ్, పాత్‌ల నిర్మాణాలను చేపట్టారు. వీటిలో కొన్ని పనులు అసంపూర్తిగానే మిగిలాయి. దీనికి ప్రధాన కారణం నిధుల కొరతని ఆ స్కూల్ హెచ్‌ఎం చెబుతుండగా.. అవినీతి జరగడంవల్లే ఈ పరిస్థితి నెలకొందని ఇప్పటి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధారాలు చూపుతోంది. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, విద్యాశాఖఅధికారులకు కమిటీ ఫిర్యాదు చేసింది. ఏ తీర్మానం లేకుండానే నిధులు దుర్వినియోగం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. నిధులు, పనులకు సంబంధించిన ఎంబుక్‌లు కూడా సరిగా నిర్వహించలేదని పేర్కొంది. ఈ మొత్తం వ్యవహారంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడితోపాటు 19వవార్డు సచివాలయం అసిస్టెంట్ ఇంజినీర్ కేవీవీ దేవీ ప్రసన్న, పూర్వపు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ పాత్ర ఉందని ఆరోపిస్తూ ప్రస్తుత కమిటీ చైర్మన్ ఫిర్యాదులో ప్రస్తావించారు. గత వైసీపీ ప్రభుత్వంలో హెచ్‌ఎం, అప్పటి స్కూల్‌మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కుమ్మక్కై 'నాడు-నేడు' నిధులను కాజేశారని ప్రస్తుత కమిటీ ఆరోపిస్తోంది. రూ.2.5కోట్లకు పైగా నిధులు విడుదలయ్యాయని, అందులో లక్షలాదిరూపాయలను దఫదఫాలుగా డ్రా చేసినట్టుగా బ్యాంకు పాస్‌బుక్‌లో నమోదైందని చెబుతున్నారు. తమకొత్త కమిటీ ఏర్పాటయ్యే నాటికి బ్యాంకు ఖాతాలో రూ.30 లక్షల సొమ్ము ఉండగా.. ప్రస్తుతం రూ.లక్షన్నర మాత్రమే ఉండడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఇక్కడ పనులు పూర్తి కాకపోయినా.. ఇక్కడి నిధులను వేరొక పాఠశాలలకు బదలాయించారంటున్నారు. తీర్మానం లేకుండానే రూ.1.93 లక్షలను చెక్కుల రూపంలో తీసేశారని చెబుతున్నారు. ఎస్ఎంస్ తీర్మానాలు చేయకుండానే నిధుల డ్రా, ఎస్ఎంఎస్ చైర్మన్ సంతకాల ఫోర్జరీ, సిమెంట్, ఐరన్, టైల్స్ తరలింపు, ఎస్ఎంఎస్ సభ్యులతో ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకోవడం, మేజర్, మైనర్‌రిపేర్స్ నిధుల్లో 60శాతం స్వాహా జరిగిందని ఎస్ఎంఎస్ కమిటీ సభ్యులు జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. దీనిపై సర్వ శిక్షాభియాన్ ఈఈ విచారణ జరిపి నాడు-నేడు ఫేజ్-2 పనులకు సంబంధించి కొన్ని లోపాలు గుర్తించి ఈ ఏడాది జనవరిలో డీఈవోకు నివేదిక ఇచ్చారు. దీనిఆధారంగా డీఈవో సంబంధిత హెచ్‌ఎం, ఇతర సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉన్నా మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎటువంటి అవినీతి జరగలేదు

మన బడి నాడు-నేడు పనులకు సంబంధించి మూడు తరగతి గదులు, పాత్‌లు, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. 2023లో రూ.75లక్షల నిధులు వచ్చాయి. మిగిలినవి మెటీరియల్ రూపంలో అందించారు. వాటితో పనులు చేపట్టాం. ఎక్కడా అవినీతి జరగలేదు. కొత్త కమిటీ వచ్చాక ఒకసారి మాత్రమే సమావేశమైంది. వారి ఆరోపణల్లో నిజం లేదు. ప్రతీది రికార్డుల రూపంలో మా దగ్గర ఉంది.

- రమణమూర్తి, స్కూల్ హెచ్‌ఎం

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్



అర్జీదారుడినుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంనుంచి అందిన అర్జీలను ప్రాధాన్యమిచ్చి లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం వివేకానందహాల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రజలనుంచి అర్జీలను జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా జేసీ రాహుల్‌మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ స్వీకరించారు. మొత్తం 404 అర్జీలను ప్రజలనుంచి స్వీకరించారు. కార్యక్రమంలో సీపీవో త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 71 అర్జీలు

కాకినాడ క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బాధితులసమస్యలను స్థానిక పోలీస్‌స్టేషన్లలోనే పరిష్కరించాలని ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 71మంది అర్జీదారులు సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఎస్పీ వెంటనే స్పందించి సంబంధిత ఎస్‌డీపీవోలు, సీఐలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్య సమ్మతమైనది ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేసి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కర్‌రావ్, ఎస్బీ డీఎస్బీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



మనల్ని ఎవడ్రా ఆపేది..

ఇష్టారాజ్యంగా వాహనాల నెంబర్ల ప్లేట్లపై రాతలు.. కనిపించని హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు



ప్రస్తుతం యువత ట్రెండ్ సెట్ చేస్తున్నాం.. అనుకుంటూనే ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. కార్లు, బైక్‌లకు నెంబర్ ప్లేట్లు లేకుండా ఇష్టారీతిన రోడ్లపై తిరుగుతున్నారు. మైనర్లు సైతం అధిక సీసీ ఉన్న బైక్‌లపై రేస్‌లంటూ దూసుకెళుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే జరిగే నష్టం అపారం. ఇలా బైక్‌లపై ఫీట్లు చేస్తున్న వారిని గుర్తించేందుకు వెహికల్ నెంబర్ ప్లేట్లు ఎంతో కీలకం. తీరా ఆ బైక్‌ల నెంబర్లను గుర్తించేందుకు వీలులేకుండా రకరకాల పేర్లతో నెంబరు ప్లేట్లపై రాసేస్తున్నారు. ఫలితంగా ప్రమాదం జరిగిన సమయంలో బాధితులు ఎవరో కూడా తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంటోంది.



కార్పొరేషన్(కాకినాడ), మార్చి17(ఆంధ్రజ్యోతి): నెంబరు ప్లేట్లు లేకుండా కొందరు ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ఇష్టానుసారంగా వాటిని నడుపుతున్నారు. కొంతమంది కార్లు ఉన్నవారిదీ అదే తీరు. రవాణాశాఖాధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం, పోలీసులు చూస్తున్నా వెంటనే స్పందించకపోవడంతో వాహనదారుల తీరు మితిమీరుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు అమర్చాల్సి ఉన్నా కొందరు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో నగరంలోని పలు మార్గాల్లో నెంబరు ప్లేట్లులేని, నెంబర్లు లేని, చిన్నగా, గజిబిజిగా రాయించిన, అస్పష్టంగా ఉన్న నెంబర్లతో వాహనదారులు రోడ్డుపై దూసుకుపోతున్నారు. కొందరు వాహనదారులు ఏకంగా సినీ హీరోలు, రాజకీయ నాయకుల ఫొటోలు, పేర్లు, ఇతరత్రా చిత్రాలతో తిరుగుతున్నారు. ఇంకొంతమంది వాహనదారులు ఎమ్మెల్యే, ఎంపీ, సీఎం తాలూకా అంటూ నెంబర్ ప్లేట్లు బదులు ఆ ప్లేట్లపై ఈవిధంగా రాసుకుంటున్నారు. వీటితోపాటు మరికొందరు మనల్ని ఎవడ్రా ఆపేదంటూ అధికారులకే సవాల్ విసురుతున్నారు. అయినా సంబంధిత అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. 2019 నుంచి షోరూంల్లో వాహనాలను కొన్నవారు తప్పనిసరిగా ప్రభుత్వం అందించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే బిగించుకోవాలన్న నిబంధన అమలుల్లోకి వచ్చింది. చాలామంది వీటిని పట్టించుకోవడం లేదు. నెంబరు ప్లేట్లను సంబంధిత

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

వాహన విక్రయదారులే సమకూరుస్తున్నా కొన్ని కొత్త వాహనాలకు ప్లేట్లు నిబంధనల ప్రకారం కనిపించడంలేదు. ఎక్కువగా యువకులు రకరకాల రూపాల్లో నెంబరు ప్లేట్లను అమర్చుతున్నారు. బైక్ రేసుల పేరుతోను, లేదా ఇద్దరు ముగ్గురు కలిసి విపరీతమైన స్పీడ్‌తో దూసుకెళుతున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులను గుర్తించే క్రమంలో నెంబరు ప్లేట్లు ఇబ్బందికరంగా మారుతున్నాయి.

హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు తప్పనిసరి



సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ ప్రకారం మోటార్ వాహనాలపై రిజిస్ట్రేషన్ మార్కు ప్రదర్శించేలా అన్ని మోటారు వాహనాల ముందు, వెనుక భాగాల్లో హైసెక్యురిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్పీ) రూపంలో స్పష్టంగా ఉండాలి. అవసరమైన చోట వాహనం ఎడమ చేతి వైపు ముందు గ్లాసుపై క్రోమియం ఆధారిత హోలోగ్రామ్ స్టిక్కర్ కూడా ఉండాలి. కొంతమంది వాహన యజమానులు ఈహెచ్ఆర్పీని వాహనానికి అమర్చడం లేదని డీలర్లు తెలిపారు. ఇది సరికాదు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- కె.శ్రీధర్, జిల్లా ఉపరవాణా కమిషనర్, కాకినాడ



ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సూరంపాలెం 'ఆదిత్య'లో ప్రో కార్టింగ్ ఎండురన్స్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

గండేపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఆదిత్య ప్రోకార్టింగ్ ఎండురన్స్ చాంపియన్‌షిప్-2025 సీజన్-5 పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏపీ, తమిళనాడునుంచి ఈ చాంపియన్‌షిప్ పోటీల్లో 13 టీమ్‌లు పాల్గొన్నాయి. ముందుగా బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిత్య వైస్‌చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ పోటీ ల్లో పాల్గొనే విద్యార్థులకు అన్నిసౌకర్యాలు కల్పించామన్నారు. పూర్తి పారదర్శకంగా పోటీలునిర్వహించేలా అన్ని ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల్లోపాల్గొనడం ద్వారా విద్యార్థులకుటీమ్ స్పిరిట్ లభిస్తుందన్నారు. ఒకరి అభిప్రాయాలు ఒకరు గౌరవించుకోవడం నేర్చుకుంటారన్నారు. మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ భీమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీల్లో బ్రేక్ టెస్ట్, ఇంజన్ టెస్ట్, డిజైన్ స్పీడ్ టెస్ట్ తదితర విభాగాల్లో నిష్ణాతులైన న్యాయనిర్ణేతలు పరీక్షించి విజేతలను నిర్ణయిస్తారన్నారు. విజేతలకు రూ.4లక్షలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆదిత్య వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్టర్ డాక్టర్ జి.సురేష్ పాల్గొన్నారు.



బెలూన్లు ఎగురవేసి పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

సత్యనికేతన్ సత్రం వ్యవహారంపై ఈవోను కలిసిన డీఎస్పీ, సీఐ

అన్నవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో కొండదిగువన ఉన్న సత్యనికేతన్ సత్రంలో ఈవో ఆకస్మిక తనిఖీల్లో ఖాళీ మద్యం సీసాలు దొరికిన సంఘటనపై పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐసూరిఅప్పారావు ఈవో వీర్ల సుబ్బారావును సోమవారం కలిసి చర్చించారు. దీనిపై ఇప్పటికే ఈవో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఇదివరకే ఆయన పర్యటన 18న ఖరారుకావడంతో దీనిపై కూడా మంగళవారం చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సత్యనికేతన్ సత్రంలో పోలీసులకు రెండు గదులు కేటాయించగా వాటిని సోమవారం ఖాళీ చేశారు. సిబ్బందిని సైతం వారం రోజుల్లో సత్రంగదులు ఖాళీచేయాలని ఈవో ఆదేశించారు. ఎప్పటినుంచి పోలీసులు, దేవస్థానం సిబ్బంది గదుల్లో ఉంటున్నారు తదితర వివరాలను అందించాలని సీఆర్వో విభాగ అధికారులను ఆదేశించారు. మరోపక్క అన్నవరం దేవస్థానానికి చెందిన స్థలాల్లో ఆక్రమణలపై, పంపా రిజర్వాయర్‌లో నీటినిల్వలపై కూడా ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ చర్చిస్తారు. కొండపై సమావేశం గురించి ఎటువంటి సమాచారం లేకపోయినా అంతాసిద్ధంగా ఉండాలని సోమవారం సిబ్బందికి సూచించారు.

'కొంగ' జపం!

జపం.. జపం.. జపం.. కొంగ జపం.. అంటే ఇదే అన్నట్టుగా కొంగలన్నీ కలిసి చెట్టుపైకి చేరి ఒక్కో కొమ్మను నివాసంగా చేసుకుని పగలు, రాత్రి కూడా అలానే ఉంటున్నాయి. చెట్టు నిండా కొంగలతో చూడచక్కని ఈ చిత్రం యానాంలో కనిపించింది.

-ఆంధ్రజ్యోతి, యానాం





యానాం నల్లచెరువును ఆనుకొని ఉన్న చెట్లపై సేదతీరుతున్న కొంగలు

నైట్రో సమైన్‌లను నిర్మూలిద్దాం...

క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అంతర్జాతీయ సెమినార్‌లో 'నన్నయ' ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫార్మాస్యూటికల్స్‌లో నైట్రోసమైన్‌లను నిర్మూలిస్తూ క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. నన్నయ వర్శిటీ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'ఫార్మాస్యూటికల్స్ విశ్లేషణాత్మక పరీక్షల్లో నైట్రోసమైన్‌ల నియంత్రణ' అంశంపై సోమవారం అంతర్జాతీయ సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ ప్రసన్నశ్రీ అతిథులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో చాలా మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారన్నారు. దీనికి జీవనశైలి, ఆహారం, పొగాకు, ఆల్కహాల్‌తో పాటు కలుషితమైన మందుల వాడకం కారణమని గుర్తు చేశారు. నైట్రోసమైన్ వంటి కొన్ని విషపూరిత మలినాలు ఆందోళన కలిగించేవిగా నిరూపితమయ్యాయన్నారు. నైట్రోసమైన్ రహిత మందులను అభివృద్ధి చేయడం ద్వారా నియంత్రించవచ్చన్నారు. మందుల వాడకంలో నియంత్రణ ఉండాలని చెప్పారు. ఫార్మాస్యూటికల్స్, అనలిటికల్ టెస్టింగ్‌లో నైట్రోసమైన్‌ల నియంత్రణ ద్వారా క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. అమెరికాలోని ఫార్మాసూటికల్స్ క్వాలిటీ అస్యూరెన్స్‌డైరెక్టర్ డాక్టర్ విష్ణు మారిశెట్టి, నన్నయ వర్శిటీ ప్రొఫెసర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, మలేషియా ఐఎన్‌టీఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ వి.రవి వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అమెరికాలోని కెమ్‌టెక్స్ లేబొరేటరీస్ శాస్త్రవేత్త డాక్టర్ నరేష్ కటారి ఆన్‌లైన్‌లో ఉపన్యసించారు. నన్నయ, గీతం వర్శిటీలతో పాటు పెర్కిన్ ఎల్మర్ సంస్థల నుంచి 12 మంది పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. సెమినార్‌లో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, కన్వీనర్ బి.జగన్మోహనరెడ్డి, నన్నయ వర్సిటీ కెమిస్ట్రీ హెచ్‌వోడీ కె.దీప్తి, అధ్యాపకులు ఎస్.రామకృష్ణ, సీహెచ్ మురళీకృష్ణ, సీహెచ్ వెంకటపద్మారావు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

గవర్నర్‌ను కలిసిన జేఎన్టీయూకే వీసీ

జేఎన్టీయూకే, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్, చాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను విజయవాడలోని రాజ్‌భవన్‌లో కాకినాడ జేఎన్టీయూ ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గవర్నర్‌ను కలిసి వర్శిటీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యాపరమైన అంశాలు, త్వరలో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించారు. గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాకినాడ జేఎన్టీయూకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సాంకేతిక విద్యలో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు, విద్యా సంస్థలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. వర్శిటీలో చేపడుతున్న మౌలిక వసతుల కల్పన, భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. సాంకేతిక రంగంలో మరిన్ని పరిశోధనలు చేపట్టేలా అధ్యాపకులను, రీసెర్చ్‌స్కాలర్స్‌ను, పీజీ విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. జేఎన్టీయూకే 11వ స్నాతకోత్సవ వేడుకలను త్వరలో నిర్వహించనున్నామని వీసీ ప్రసాద్ గవర్నర్‌కు వివరించారు. అంతే కాకుండా విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అందరి సమిష్టి కృషితో జేఎన్టీయూకేను అభివృద్ధిపథంలో నడిపిస్తామని గవర్నర్‌కు వివరించారు.



వర్సిటీలో చేపడుతున్న అభివృద్ధిని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వివరిస్తున్న వీసీ ప్రసాద్



ఈవో లక్ష్మీనారాయణ, అర్చకులకు వెండి అందజేస్తున్న దాత గోపాలకృష్ణమాచార్యులు

సర్పవరం భావనారాయణస్వామికి..

పది కిలోల వెండి వితరణ

సర్పవరం జంక్షన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరంలోని శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామికి కాకినాడకు చెందిన సాతులూరి గోపాలకృష్ణమాచార్యులు పది కిలోల వెండి సమర్పించారు. దీనిని ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణకు అర్చకుల సమక్షంలో అందజేశారు. శ్రీమూల భావనారాయణస్వామికి వెండి మకరతోరణం చేయించాలన్న దాత కోరిక మేరకు వెండిని బ్రహ్మానికి ఇచ్చినట్టు ఈవో తెలిపారు. దాతకు ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాశరావు, పుల్ల వీరబాబు, ఉద్యోగులు కుమార్, చందు పాల్గొన్నారు.



పెదపళ్ల గ్రామ దేవత పోలేరమ్మకు వెండి కిరీటం సమర్పించిన జాస్తి కుటుంబీకులు

పోలేరమ్మకు మూడు కిలోల

వెండి కిరీటం

ఆలమూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామ దేవత పోలేరమ్మకు గ్రామానికి చెందిన జాస్తి సుబ్బన్న-లక్ష్మీనరసమ్మ, సూరన్న-సత్యవతి, శ్రీరాములు-సూరమ్మ దంపతులు వారి వారసులు సుమారు రూ.3.40లక్షలతో మూడు కిలోల వెండితో కిరీటం చేయించారు. సోమవారం దానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. జాస్తి భాస్కరరావు, జాస్తి వీర్రాజు, దాసరి శారదాంబ, జాస్తి వెంకటేశ్వరరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

'నన్నయ' హెల్త్ సెంటర్ అభివృద్ధికి రూ.15 లక్షల విరాళం

దివాన్‌చెరువు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం హెల్త్ సెంటర్ అభివృద్ధికి కాకినాడకు చెందిన ఎలైట్ నేచురల్ ఆయిల్స్ అండ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తోట సుబ్రహ్మణ్యం రూ.15లక్షలు విరాళం ప్రకటించారని వీసీ ప్రసన్నశ్రీ తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన సుబ్రహ్మణ్యం.. తన తండ్రి హరిబాబు జ్ఞాపకార్థం ఈ విరాళం ప్రకటించినట్టు చెప్పారు. విశ్వవిద్యాలయంలో హెల్త్ సెంటర్‌ను విస్తరించి అభివృద్ధి చేయడానికి ఈ నిధులను వినియోగిస్తామన్నారు. ఈ సందర్భంగా దాతను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు.



దాత సుబ్రహ్మణ్యానికి జ్ఞాపిక అందజేస్తున్న సత్కరిస్తున్న ఉప కులపతి ప్రసన్నశ్రీ



డెల్టా కాలువలకు

నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సాగునీటిని మరింత పెంచి 10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టాకు 3,200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2,000 క్యూసెక్కులు, 5,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 10,391 క్యూసెక్కులుగా ఉండగా ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.10 అడుగులుగా నమోదైంది.

'టెన్'షన్!

పరీక్ష గదిలో సిమెంటు బస్తాలు

ఆందోళనకు గురైన విద్యార్థులు



పరీక్షా కేంద్రంలో ఎదురుచూస్తున్న విద్యార్థులు

అమలాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని నల్లవంతెన వద్ద గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష గదిలో సిమెంటు బస్తాలు ఉండడంతో కలకలం రేగింది. పరీక్షకు కొన్ని నిమిషాల ముందే ఆ గదిలో ఉన్న సిమెంటు బస్తాలను హడావుడిగా కార్మికులతో బయటికి మోయించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి బల్లలపై నంబర్లు సైతం వేసి ఉన్న 7వ నంబరు గదిలో కొన్ని బల్లలను పక్కకు పెట్టి సిమెంటు బస్తాలను భారీగా నిల్వ చేసిన తీరు చర్చనీయాంశమైంది. అదే గదిలో 22 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా వారిని బయట నిలుచోబెట్టి బస్తాలను క్లాస్ రూము నుంచి బయటికి హడావుడిగా తరలించారు. అయితే ఈ సమాచారం మీడియాకు చేరడంతో కలకలం రేగింది. అక్కడ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. బస్తాలు తొలగించిన అనంతరం ఏవిధమైన తుడుపు లేకపోవడంతో విద్యార్థులు బెంచీలను శుభ్రం చేసుకుని పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమాచారం తెలుసుకున్న డీఈవో సలీంబాషా ఆ పరీక్షా కేంద్రానికి చేరుకుని అక్కడి పరిస్థితులు పరిశీలించి విచారణకు ఆదేశించారు. అమలాపురం ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ పి.అశోక్‌ప్రసాద్‌తో కలిసి డీఈవో ఆ పరీక్షా కేంద్రంలో సిమెంటు బస్తాలు తొలగించకపోవడానికి గల కారణాలు, ఇతర పరిస్థితులపై సహచర ఉపాధ్యాయులను విచారించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్టు సమాచారం. కాగా అమలాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్త కుప్పలను ఒక్కసారిగా పరీక్షా సమయానికి ముందే తగలబెట్టడంతో భారీగా పొగ కమ్మేసింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. పొగ వ్యాపించకుండా నీళ్లతో ఆర్పే ప్రయత్నాలుచేశారు.



సిమెంటు బస్తాలు తొలగిస్తున్న సిబ్బంది

'పది'కి ప్రేమతో..!

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రాంభమయ్యాయి. సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పరీక్షలు రాసేందుకు విద్యార్థులు పరుగులు తీశారు. అయితే కొన్నిచోట్ల దివ్యాంగులు పరీక్షలు రాసేందుకు పయనమవ్వగా వారిని తల్లిదండ్రులు ప్రేమతో, ఎంతో జాగ్రత్తగా పరీక్ష కేంద్రాలకు తీసుకొచ్చి పరీక్ష రాయించారు.



రాజమహేంద్రవరం చున్నీలాల్ జాజు హైస్కూల్‌కు దివ్యాంగురాలైన కూతురు నవ్యశ్రీని తీసుకొచ్చి పరీక్ష రాయించిన తండ్రి



తొండంగి: పెరుమాళ్లపురంలో ఎగ్జామ్ సెంటర్‌కు పోలియో కారణంగా కొడుకు కార్తీక్‌ను ఎత్తుకు తీసుకొచ్చిన తల్లి





రాజానగరం హైస్కూల్ పరీక్షా కేంద్రానికి దివ్యాంగులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు



అమలాపురంలో పరీక్షా కేంద్రం వద్ద కుమారుడికి తోడుగా వచ్చి జాగ్రత్తలు చెప్తున్న తల్లి







కాకినాడలో హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, పరీక్షా కేంద్రం వద్ద తనిఖీలు

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి

మాస్టర్ ప్లాన్ సిద్ధం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రామనారాయణరెడ్డి

అంతర్వేది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది పుణ్యక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అత్యంత ప్రసిద్ధి చెందిన ఆలయం, మా ఇంట ఇలవేల్పు లక్ష్మీనరసింహస్వామి, మా ఇంట దేవత చెంచులక్ష్మి అని తెలిపారు. వేల ఎకరాల భూములు ఉన్నా శిస్తులు సరిగా రాక ఆదాయమార్గాలు సరి చేయడానికి అధికారులు, అర్చకులతో సోమవారం ముఖ్య సమావేశం నిర్వహించారు. ప్రధానంగా స్వామివారి ఆలయ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని చర్చించారు. ఆలయానికి ఈశాన్య భాగంలో రూ.3.5 కోట్లతో కోనేరు నిర్మాణానికి అంచనా వేశామన్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటి రహదారుల పరిశుభ్రతతో పాటు నూతన రహదారుల నిర్మాణం, ఉన్న రోడ్లను మెరుగుపరిచే విధానంలో మార్పులు చేయాలన్నారు. ఇప్పటికే 5,65 దేవాలయాలకు రూ.5వేలు ఇచ్చే విధానానికి ఎన్నికల హామీ ప్రకారం రూ.10వేలు అందించి ప్రతీ ఆలయంలోని ధూప దీప నైవేద్యాలకు కేటాయించామన్నారు. అదనంగా 150 దేవాలయాలను తీసుకున్నామని తెలిపారు. అలాగే అమలాపురం డివిజన్‌లో 74, రామచంద్రపురం 33, కొత్తపేట 62 మొత్తం 169 ఆలయాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలమేరకు రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లు సిద్ధంచేసే విధంగా అధికారులను రిపోర్టు తయారుచేయమని ఆదేశించామన్నారు. అలాగే క్షేత్రపాలకుడు నీలంకంఠేశ్వరస్వామి ఆలయానికి కూడా కృషి చేస్తామని, ప్రస్తుతం రూ.4కోట్ల సీజీఎస్ ఫండ్‌తో ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పటికీ దాతలు 30శాతం అమౌంట్‌తో ముందుకు వచ్చినట్టయితే త్వరలోనే ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని స్థానిక నాయకులకు హామీ ఇచ్చారు. స్వామివారి ఆలయ భూములపై పురాతన కాలం నుంచి చేస్తున్న రైతులకు శిస్తు పెంచే ఆలోచనపై కలెక్టర్‌తో కమిటీవేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆలయంలో పనిచేసే నాయీబ్రాహ్మణులకు జీతాలు పెంపుపై వారు అడగ్గా రూ.20 నుంచి రూ.25వేల వరకు పెంచడానికి చర్యలు చేపడతామని మంత్రి ఆనం తెలిపారు.

దగ్ధమైన రథం పరిశీలన..

2020 సెప్టెంబరులో అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి రథం అగ్నికి ఆహుతి అవడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. రథం శిథిలాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. దగ్ధమైన రథం ఆలయ పరిసర ప్రాంతాల్లో ఐదేళ్లు ఉండడం శ్రేయస్కరం కాదని ఆగమ పండితులు వాపోయరన్నారు. కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్, ఆలయ అధికారులతో రథం ఘటనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రథాన్ని జలసమాధి చేయడానికి కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యామిలీ ఫౌండర్ మెంబర్, చైర్మన్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, డీసీ రమేష్‌బాబు, ఏసీ సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, పోతురాజు కృష్ణ, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

కర్కశ తండ్రి!

- పిల్లలను కాలువతో తోసేసిన నాన్న
- కుమార్తె మృతి, కుమారుడు క్షేమం
- కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు వద్ద ఘటన



కారుణ్య మృతదేహం

ఫైల్‌ఫొటో



వెంటూరులో రోధిస్తున్న తల్లి విజయ, కుమారుడు సందీప్

రాయవరం/ద్రాక్షారామ, మార్చి 17(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఇటీవల ఓ తండ్రి తన ఇద్దరు కుమారులను హత్య చేసి, తాను ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో మరువక ముందే మరో తండ్రి తన ఇద్దరు పిల్లలను కాలువలోకి తోసేశాడు. కుమార్తె మృతిచెందగా కుమారుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కన్న బిడ్డలను కడుపులో పెట్టుకుని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రి తన పిల్లలను కాలువలోకి తోసేశాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు శివారు గజపతినగరం వద్ద కాలువలో తోసేయగా ఈ సంఘటనలో కుమారుడు కాలువలో తుప్పలను పట్టుకుని నెమ్మదిగా ఒడ్డుకు చేరుకుని క్షేమంగా బయటపడగా, కుమార్తె కాలువలో కొట్టుకుపోయి మృతిచెందింది.

రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య విజయ, పదేళ్ల కుమారుడు రామ్ సందీప్, ఏడేళ్ల కుమార్తె కారుణ్య ఉన్నారు. రామచంద్రపురంలో ఓ ప్రైవేటు పాఠశాలలో సందీప్ నాలుగో తరగతి చదువుతుండగా, కారుణ్య 1వ తరగతి చదువుతోంది. రాజు వెంటూరులో తన ఇంటి వద్ద నుంచి పిల్లలను రామచంద్రపురం పాఠశాలకు రోజు మాదిరిగా మోటార్‌సైకిల్‌పై తీసుకువెళ్లినట్టు సమాచారం. సోమవారం మధ్యాహ్నం పాఠశాల సమయం ముగిసిన తరువాత ఇంటికి పిల్లలను తీసుకు వచ్చే క్రమంలో కాలువలోకి తోసేసినట్టు భావిస్తున్నారు. కుమారుడు సందీప్ తుప్పలను పట్టుకుని నెమ్మదిగా బయటపడి ఏడుస్తూ కేకలు వేయడంతో స్థానికులు చూడడంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం సందీప్ తీవ్ర భయాందోళనకు గురై ఎటువంటి వివరాలు పూర్తిగా చెప్పలేకపోతున్నాడని గ్రామస్థులు చెబుతున్నారు. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కారుణ్య మృతదేహం లభించింది. రాజు ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రాజు ఏమైనట్టు?



పిల్లి రాజు

పిల్లలను కాలువలో తోసేసిన తరువాత రాజు కాలువలో దూకేశాడా లేదా అక్కడ నుంచి పరారయ్యాడా అనే సందిగ్ధం గ్రామస్థులు, బంధువుల్లో నెలకొంది. రాజు గ్రామంలో అందరితో కలుపుగోలుగా మంచి గా ఉండేవాడని గ్రామస్థులు చెబుతున్నారు. వ్యాపార లావాదేవీల్లో కొంత నగదు రావాల్సి ఉండి, ఒత్తిడికి గురై ఇటువంటి ఘాతుకానికి పూనుకున్నాడా అనే అనుమానం వారి నుంచి వ్యక్తమౌతుంది.

వెంటూరులో విషాదఛాయలు

గ్రామంలో ఎప్పుడూ అందరితో కలుపుగోలుగా ఉండే రాజు తన పిల్లలను కాలువలో తోసేసిన ఘటనలో కుమార్తె కారుణ్య మృతి చెందడంతో వెంటూరులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య విజయ, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఆరేళ్ల చిన్నారి మృతదేహాన్ని చూసి చలించిపోయారు. ఈసంఘటన స్థానికుల్ని తీవ్రంగా కలచివేసింది.

ఎంసీపీసీతో కేసుల సత్వర పరిష్కారం

న్యాయవాదులకు శిక్షణ ప్రారంభంలో పీడీజే గంధం సునీత



శిక్షణ తీసుకునే న్యాయవాదులతో పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం, రాజీ ప్రాజెక్టు కమిటీ (ఎంసీపీసీ) ఆధ్వర్యంలో కేసుల సత్వర పరిష్కారానికి అవకాశం ఉందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఎంసీపీసీ ఆధ్వర్యంలో న్యాయవాదులకు 5రోజుల పాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సుప్రీం, హైకోర్టుల ఆదేశాలతో ఎంసీపీసీ విధానంపై న్యాయాధికారులు, న్యాయవాదులకు అవగాహనతో కూడిన శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. 36 మంది న్యాయవాదులకు 5 రోజుల పాటు 48 గంటలకు తగ్గకుండా తమిళనాడు నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ శిబిరం 21వ తేదీతో ముగుస్తుందని చెప్పారు. విశాఖపట్నంలో జిల్లా ప్రధాన, ఇతర న్యాయమూర్తులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కోర్టు సంబంధిత కేసుల్లో పరిష్కారానికి 4 విధానాలు ఉన్నాయన్నారు. దీనిలో మధ్యవర్తిత్వానికి సూచించిన కేసులకు శిక్షణ పొందిన జ్యుడీషియల్ అధికారులు, న్యాయవాదులను నామినేట్ చేయడం జరుగుతుందన్నారు. కేసుకు సంబంధించిన ఇరుపక్షాలనూ వాళ్లు పిలిపించి ఆమోదయోగ్యంగా ఉండే విధంగా మాట్లాడి ఒకటి, రెండు సిట్టింగుల్లో.. గరిష్ఠంగా 6 నెలల్లో రాజీ మార్గం ద్వారా కేసును పరిష్కరిస్తారన్నారు. దీనికి కూడా లోక్ అదాలత్ మాదిరిగా అప్పీల్‌కి అవకాశం ఉండదన్నారు. కోర్టుకు చెల్లించిన ఫీజును కూడా కక్షిదారులకు తిరిగి చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పుడు నిర్వహిస్తున్న వసతితో కూడిన శిక్షణకు తగిన ఏర్పాట్లు చేశామని పీడీజే తెలిపారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్‌కే జానీ భాషా, మాస్టర్ ట్రైనర్లు ఆర్.విజయకమల, ఆర్.రత్నతార తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక.. కుటుంబాన్ని పోషించలేక..

కాకినాడలో వివాహిత ఆత్మహత్య



మరణించిన తలాటం స్వాతి (ఫైల్ ఫొటో)



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

కాకినాడ క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మద్యానికి వ్యసనపరుడిగా మారిన భర్త పెట్టే వేధింపులు తాళలేక, కుటుంబ పోషణ భారంగా మారడంతో ఏంచేయాలో పాలుపోలేని స్థితిలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకెళితే కాకినాడ అర్బన్ ఎస్.అచ్చుతాపురం అంబేడ్కర్ కాలనీలో నివాసముంటున్న తలాటం సురేష్, స్వాతి (26) భార్యభర్తలు. వారిద్దరూ ఎమినిదేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఐదేళ్ల కొడుకు నిషాంత్, 6నెలల పాప శాన్వి సంతానం. భర్త కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య స్వాతి బీఫార్మసీ చేసి కరణంగారి సెంటర్‌లో గల అపోలో ఫార్మసీలో ఉద్యోగం చేస్తోంది. మద్యానికి వ్యసనపరుడైన భర్త డబ్బుల కోసం వేధించడం, కొట్టడం, దూషించడం వంటి వేధింపులకు పాల్పడుతుండటంతో పలుసార్లు తగాదాలు పడ్డారు. కొన్నాళ్లపాటు ప్రతాప్‌నగర్‌లో అద్దెకు ఉండేవారు. ప్రస్తుతం అత్తగారు ఇంటికి సమీపంలో అద్దెఇంట్లో నివాసం ఉంటున్నారు. సంపాదించిన డబ్బులు మద్యానికి ఖర్చుచేయడం, భార్య సంపాదించిన జీతం సైతం తీసుకుని తాగేయడంతో కుటుంబ పోషణ భారంగా ఉండడంతో ఏం చేయాలో పాలుపోలని స్థితిలో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ధారణకు వచ్చింది. ఆదివారం రాత్రి తన భర్త, ఇద్దరు పిల్లలు పడుకున్నాక సుమారు 2 గంటల ప్రాంతంలో బెడ్ రూమ్ పక్కన ఉన్న మరొక రూమ్‌లోకి వచ్చి ఫ్యాను పక్కన ఉన్న ఇనుపఉక్కి చీరతో మెడకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తెల్లవారుజాము 3 గంటల సమయంలో పాప ఏడు స్తోండటంతో నిద్రలేచిన భర్త సురేష్ భార్య కోసం పరిశీలించాడు. పక్క గదిలోకి వెళ్లగా ఫ్యానుకు వేలాడుతూ విగతజీవిగా ఉండటాన్ని చూసి బంధువులు, పోలీసులకు సమాచారం అందించాడు. కాకినాడ టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు మృతదేహాన్ని పరిశీలించి పక్కన ఉన్న సూసైడ్ నోట్‌ని స్వాధీనం చేసుకున్నారు. ఆమె సెల్‌ఫోన్‌ని పరిశీలించగా అందులో తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు, భర్త సంపాదించిన డబ్బులు మద్యానికి పోయడం, ఉద్యోగం చేసిన తెచ్చిన జీతం డబ్బులను సైతం తీసేసుకుని రోజూ మద్యం తాగి వేధింపులకు పాల్పడడంతో ఏం చేయాలో పాలు పోక, భవిష్యత్తులో పిల్లలను ఎలా పెంచాలి, కుటుంబ పోషణ ఎలా చేయాలో తెలియక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో సందేశాన్ని పరిశీలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. సంఘటనా స్థలంలో సూసైడ్‌నోట్, సెల్ఫీ వీడియో స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించడం జరిగిందన్నారు. అభంశుభం తెలియని చిన్నారులను ఎవరు సాకుతారంటూ స్వాతి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు రోధించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గోపాలపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో ఆదివారం అర్థరాత్రి జరిగింది. ఎస్‌ఐ కే.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గోపాలపురం గ్రామానికి చెందిన కొవ్వూరి నాగిరెడ్డి ఇంటి వద్ద నుంచి గోపాలపురం సెంటర్‌కు నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగిరెడ్డికి రెండుకాళ్లకు రక్తపు గాయాలు కావడంతో గోపాలపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తీసుకురాగా అప్పటికే నాగిరెడ్డి మృతిచెందినట్టు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. అతడి కుమారుడు కొవ్వూరి జశ్వంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు వెదురుకర్రతో నిర్మాణాలు

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

దివాన్‌చెరువు, మార్చి17 (ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు వెదురుకర్రతో నిర్మాణాలు చేపట్టేదిశగా అడుగులు వేయాలని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా లాలాచెరువు అటవీ అకాడమీలో వెదురుసాగు విస్తీర్ణం పెంచడంపై ఔత్సాహిక రైతులు, ట్రేడర్స్‌కు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ బాంబో మిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. పాత పద్ధతుల్లో బుట్టలు, తట్టలు, నిచ్చెనలు చేసే దగ్గర నుంచి ప్రస్తుతం భవనాల నిర్మాణాలు, బాంబో హోటల్స్, రిసార్ట్స్ వెదురుకర్రలతో ఏర్పాటు చేయవచ్చన్నారు. వెదురును వివిధ ఉత్పత్తుల ఆవిష్కరణ దిశగా రైతులు, వ్యాపారులు నైపుణ్యం పెంచుకోవాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బీఎస్ఏన్ మూర్తి అన్నారు. వెదురుతో తయారుచేసే ఉత్పత్తుల ఆవిష్కరణ దిశగా రానున్న రోజుల్లో గ్రామస్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. మహారాష్ట్ర సింధూరు జిల్లాకు చెందిన కాన్‌బేక్ కంపెనీ చెందిన చైర్మన్ సహ వ్యవస్థాపకుడు సంజీవ్ శశికాంత్ కార్వే మాట్లాడుతూ వెదురుతో హోటల్, రిసార్ట్స్ నిర్మించినట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రవీంద్రధామ, డీఎఫ్‌వో శ్రీనివాస్, ఉద్యానశాఖ అధికారి డి.సుధీర్ కుమార్ తదితరులున్నారు.

స్నేహితుడి ఇంటికొచ్చి...కాల్వలో గల్లంతై!



గెద్దం కార్తీక్ (ఫైల్‌ఫొటో)

కడియం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సరదాగా స్నేహితున్ని కలుద్దామని వచ్చాడు... కాసేపు మాట్లాడుకుని గ్రామంలో ఉన్న కాలవ వద్దకు స్నానానికి వెళ్లాడు. అంతలోనే గల్లంతయ్యారు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం జేగురుపాడులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన గెద్దం కార్తీక్ (20), జేగురుపాడుకు చెందిన చందు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నారు. సోమవారం కార్తీక్ తన స్నేహితుడు చందు ఇంటికి జేగురుపాడు వచ్చాడు. ఇద్దరూ స్నానానికి అని జేగురుపాడులో ఉన్న కాల్వలోకి దిగారు. కానీ అంతలోనే కార్తీక్ గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కార్తీక్ కోసం గాలింపు చర్యలు చేయిస్తున్నారు. సీఐ ఏ.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మరణంపై వివాదం

కాకినాడ క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళ మరణంపై వివాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా తుని మండలం హంసవరం గ్రామానికి చెందిన పోతుల పాప (50) తీవ్ర శ్వాసకోస సమస్యతో ఈ నెల 12న కాకినాడలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. పాపకు క్షయ, మధుమేహం కూడా ఉన్నాయని వైద్య పరీక్షల్లో గుర్తించారు. 3 రోజులుగా వార్డులో చికిత్స పొందుతున్న పాప ఆరోగ్యం సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా విషమించింది. దాంతో వైద్యులు ఆమెను ఐసీయూకీ తరలిస్తున్న క్రమంలో పాప మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు భగ్గుమన్నారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పాప ప్రాణాలు కోల్పోయిందని, పాప మృతిపై ఆసుపత్రి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని ఆందోళన చేశారు. అధికారులు, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

లారీ ట్యాంకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆత్మహత్య



బావిశెట్టి వెంకటేశ్వరరావు (ఫైల్)

సర్పవరం జంక్షన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ పండూరుకు చెందిన లారీ ట్యాంకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బావిశెట్టి వెంకటేశ్వరరావు (48) సోమవారం హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో కొన్నేళ్ల పాటూ ట్యాంకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో చేసిన అప్పులు తీర్చలేక ఇటీవలే తన పేరిట ఉన్న సుమారు 4 ఎకరాల భూమిని విక్రయించి అప్పులు తీర్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌లో 2నెలలు ఉంటానని చెప్పి స్వగ్రామం నుంచి వెళ్లిన నెలరోజులకే ఇలా అర్థాంతరంగా ఆత్మహత్యకు పాల్పడతారని భావించలేదని వాపోయారు. మృతదేహం సోమవారం రాత్రికి స్వగ్రామం పండూరుకు చేరుకునే అవకాశం ఉందన్నారు. మృతుడికి ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడే అలవాటు ఉందని, ఆ బెట్టింగ్‌లో పెద్ద మొత్తంలో డబ్బులు నష్టపోవడం, డబ్బుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, అసలు, వడ్డీ ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని విక్రయించి అప్పులు తీర్చినట్టు తెలిసింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. కుమారుడు విజయనగరంలో ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్నాడు. బావిశెట్టి వెంకటేశ్వరరావు ఆత్మహత్య వార్త విన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అందరితో కలివిడిగా మాట్లాడే వెంకటేశ్వరరావు ఆత్మ హత్య చేసుకున్నాడన్న విషయం తెలిసిన తర్వాత షాక్‌కి గురయ్యానని, కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



సుబ్బారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అంతర్వేది, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అప్పనరామునిలంకలో తిరుమాని సుబ్బారావు (59) రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 5.30గంటలకు తిరుమాని సుబ్బారావు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొని తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి భార్య తిరుమాని ముత్యాలమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొనడంతో మరొకరు..

అలాగే సఖినేటిపల్లి మండలం గుడిమూలకు చెందిన బత్తిన పైడిరాజు(23) సోమవారం సాయంత్రం 4గంటల సమయంలో మోటారుసైకిల్‌పై వెళ్తుండగా సినిమాహాలు సెంటర్‌లో కారు ఢీకొనడంతో ఎగిరి పక్కనున్న ప్రహరీ గోడపై పడి అక్కడికక్కడే మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. తండ్రి బత్తిన బంగార్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఉపాధి నిమిత్తం సఖినేటిపల్లి మండలానికి వచ్చిన పైడిరాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డే

కాకినాడ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాథపురం ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 604 మంది 2024-25 విద్యా సంవత్సరంలో ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం ప్రిన్సిపాల్ ఎన్. జనార్దనరావు అధ్యక్షతన సోమవారం జాబ్ అచీవర్స్ డే, అలుమ్ని డే నిర్వహించారు. వీల్స్ ఇండియా కంపెనీ మేనేజర్ దివాకర్, కేఎస్‌పీఎల్ డీజీఎం రవికుమార్, ఏపీటీవో ఎస్ఏ ప్రెసిడెంట్ రమణ పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి ట్యాలీ శిక్షణను ప్రారంభిస్తున్న అతిథులు

అధ్యాపకేతర సిబ్బందికి ట్యాలీ శిక్షణ

జేఎన్టీయూకే, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో జేఎన్టీయూకే, యూసీఈకే అధ్యాపకేతర సిబ్బందికి ట్యాలీ శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా హాజరైన వర్సిటీ పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ వి.రవీంద్ర, ఓఎస్డీ కోటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వనరులను వినియోగిస్తున్నప్పుడు జవాబుదారీతనం ఉండేందుకు ట్యాలీ సాఫ్ట్‌వేర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోటేశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుబ్బారావు, డీఆర్, ఏఆర్‌లు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

సమస్యల పరిష్కారానికి పెన్షనర్ల విజ్ఞప్తి

కరప, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు పెన్షనర్లు సోమవారం తహసీల్దారు నందిపాటి సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. 12వ పీఆర్సీ ఏర్పాటుచేసి ఐఆర్ ప్రకటించాలని, డీఆర్, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, గత పీఆర్సీలో తగ్గించిన అదనపు పెన్షన్ పరిమాణాన్ని పూర్వ పద్ధతిలో పునరుద్ధరించాలని, ఈహెచ్ఎస్ కార్డుపై పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కరప మండల యూనిట్ అధ్యక్షుడు వి.రాఘవస్వామి, కార్యదర్శి ఆర్.పెదసత్తిరాజు, జిల్లా కార్యదర్శి పి.తాతారావు, ఎ.వెంకటేశ్వర్లు, పీఎస్ఎస్‌వీఎస్‌పీ శర్మ తదితరులు పాల్గొన్నారు.



డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలు విజయలక్ష్మిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, సహచర అధ్యాపకులు

కెమిస్ట్రీ లెక్చరర్ అనంతలక్ష్మికి డాక్టరేట్

పిఠాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్రం అధ్యాపకురాలు వి.అనంతలక్ష్మికి డాక్టరేట్ లభించింది. విశాఖపట్టణం గీతం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డి.సూర్యకళ పర్యవేక్షణలో ఆమె 'నానో స్పైనల్ ఫెరైట్స్' అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు. సోమవారం కళాశాల ఆవరణలో అనంతలక్ష్మిని ప్రిన్సిపాల్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సన్మానించారు.

'రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి'



మాట్లాడుతున్న మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకుడు శ్రీనివాస్

పెద్దాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకుడు టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఏరువాక కేంద్రంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరువాక కేంద్రం, రిలయన్స్, వ్యవసాయ శాఖ అనుబంధంతో ఎక్కువ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు క్షేత్ర పరిశీలన చేయాలని సూచించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.సీతా రామశర్మ 2024-25లో చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రైతులు ఎరువులు, పురుగు మందులు తగ్గించి వ్యవసాయంపై పెట్టుబడి తగ్గించుకోవాలని వ్యవసాయాధికారి శ్రీహరి సూచించారు. ఏపీఎంఐపీ పీడీ వరప్రసాద్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



ఫిజియోథరపీ విధానాన్ని తిలకిస్తున్న సీఎంవో చామంతి నాగేశ్వరరావు

భవిత కేంద్రం సందర్శన

సామర్లకోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో భవిత కేంద్రాన్ని జిల్లా సెక్టోరియల్ అధికారి చామంతి నాగేశ్వరరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఫిజియోథెరపీ సేవలు సక్రమంగా అందుతున్నాయో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారి మేథస్సును పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎంవో వెంట ఎంఈవో పట్టపగలు పుల్లయ్య, భవిత కేంద్రం సిబ్బంది అనిత, పద్మావతి వున్నారు.

కైలాస భూమిలో నీళ్ల ట్యాంకు ఏర్పాటు

పెద్దాపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరు గ్రామ శివారు కైలాస భూమిలో తాళ్లూరు సత్రం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంచినీళ్ల ట్యాంకును సత్రం అధ్యక్షుడు డాక్టర్ తాళ్లూరు శేఖర్ సోమవారం ప్రారంభించారు. సుమారు మూడువేల లీటర్ల సామర్థ్యంతో రూ.లక్ష వ్యయంతో దీనిని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తాళ్లూరి ప్రసాద్, సత్తిరాజు, శ్రీనివాస్, రాజు, రవితేజ, కామేష్, నాయకులు ఏలేటి సుబ్బారావు, సత్తిబాబు, చిక్కాల సాయిరాం పాల్గొన్నారు.



గొల్లప్రోలులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



పిఠాపురంలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న దృశ్యం

'పది' పరీక్షలు ప్రశాంతం

పిఠాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పరీక్ష సమయం దగ్గరపడడంతో ఉరుకులు పరుగులు పెట్టారు. పిఠాపురం పట్టణంలోని పలు కేంద్రాల వద్ద సోమవారం ఉదయం ఈ పరిస్థితి కనిపించింది. విద్యార్థులను తనిఖీ చేసిన తర్వాతే కేంద్రాల్లోకి అనుమతించారు. పిఠాపురం పట్టణంలోని ఏడు, మండలంలోని విరవాడ, మల్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల కేంద్రాల్లో 1,705 మంది విద్యార్థులకు 1,698 మంది హాజరయ్యారు. గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులు 12 మందికి ఐదుగురే వచ్చారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని మూడు, తాటిపర్తి, చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని రెండు పరీక్షా కేంద్రాల్లో 1,133 మంది విద్యార్థులకు 1,127 మంది హాజరయ్యారు. చేబ్రోలులో దివ్యాంగ విద్యార్థి సీహెచ్ శేషగిరి పరీక్ష రాసేందుకు రాగా అతడికి సహాయకుడు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను డీవైఈవో వెంకటేశ్వరరావు, గొల్లప్రోలు ఎంఈవో-2 శివప్రసాద్ పరిశీలించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పాడ కొత్తపల్లి, మూలపేట, కొమరగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కొత్తపల్లి వీవీఎస్ పబ్లిక్ స్కూలులో మొత్తం 987 మంది విద్యార్థులకు 980 మంది పరీక్షలకు హాజరయ్యారని ఎంఈవో వేణుగోపాల్ తెలిపారు. ఓపెన్ టెన్త్ పరీక్షలకు 8 మందికి ఇద్దరు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాలను కాకినాడ నుంచి వచ్చిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించింది.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం పట్టణం, మండల పరిధిలో ఎనిమిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. 1,579 మంది విద్యార్థులకు 14 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో చౌదరి తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పర్యవేక్షిస్తూ పకడ్బందీగా నిర్వహించారని చెప్పారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన దివ్యాంగుడు శేషగిరి

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం, పట్టణంలోని పది కేంద్రాల్లో 1,499 మంది విద్యార్థులకు 1,491 మంది హాజరయ్యారని ఎంఈవో శివరామకృష్ణయ్య చెప్పారు. కంపార్ట్‌మెంటల్‌కు 23 మందికి ఆరుగురు గైర్హాజరయ్యారు. సామర్లకోట పట్టణం, మండలంలోని వేట్లపాలెం పరీక్షా కేంద్రాలను ఆర్జేడీ నాగమణి సోమవారం సందర్శించి ఇన్విజిలేటర్లకు సూచనలు చేశారు. పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తుతో పాటు డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు.

కరప (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరప ఎ, బి సెంటర్లు, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి, వేళంగి హైస్కూళ్లలో 901 మంది విద్యార్థులు హాజరు కాగా 8 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ చెప్పారు. గొర్రిపూడి, పెద్దాపురప్పాడు పరీక్షా కేంద్రాలను డీఈవో పిల్లి రమేష్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి చీఫ్ సూపరిండెంట్‌లకు పలు సూచనలు చేశారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూడాల్సిన బాధ్యత సీఎస్‌లదేనని ఆయన స్పష్టం చేశారు.



సామర్లకోటలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద డ్రోన్ కెమెరాతో పోలీసు నిఘా





కరప, ఉప్పాడ కొత్తపల్లి ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 44 అర్జీలు

పిఠాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ అతిథిగృహం ఆవరణలో గల పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి ప్రజల నుంచి 44 వినతులు స్వీకరించారు. ఇకపై ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ జరుగుతుందని ఆమె తెలిపారు. ఏపీడీ వసంతమాధవి, మునిసిపల్ కమిషనరు నామా కనకారావు, తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పట్టణంలో రోడ్డు విస్తరణ కోసం గతంలో ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాలు తీసుకున్నారని, కానీ విస్తరణ చేపట్టలేదని మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, పెమ్మరాజు సత్యరామచంద్రరావు, చింతపల్లి సింహాద్రి తెలిపారు. విస్తరణ చేయకపోతే కళాశాల స్థలం వెనక్కి అప్పగించాలని కోరారు. కుక్కుటేశ్వరస్వామి దేవస్థానానికి చేర్చి ఉన్న హిందూ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాల అనంతరం స్నానాలు చేసేందుకు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, తక్షణం ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.



'పాడా' ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణికి వినతిపత్రం ఇస్తున్న మన ఊరు-మన బాధ్యత సంస్థ ప్రతినిధులు

'ప్రకటనలు తప్ప ఆచరణలో శూన్యం'

పెద్దాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటనలు ఆచరణలో శూన్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ అన్నారు. పట్టణంలోని యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ పంచాయతీ వర్కర్స్‌కి ఆరు నెలల నుంచి సంవత్సరం వరకు జీతాలు బకాయిలు ఉన్నాయన్నారు. కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబీరాణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చెక్కల రాజకుమార్, డి.క్రాంతికుమార్, పలివెల వీరబాబు, చంద్రవతి, రాజా, ఈశ్వరరావు, షేక్ పద్మ, నక్కేల శ్రీను, మేడిశెట్టి వెంకటరమణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ సిబ్బంది

రక్తదానంతో పునర్జన్మ

సర్పవరం జంక్షన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో రక్తం అందక ఎందరో నిరుపేదలు మృతి చెందుతున్నారని, రక్తదానంతో పునర్జన్మ ప్రసాదించినవారు అవుతామని కాకినాడ జీజీహెచ్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీహరిబాబు అన్నారు. సోమవారం వాకలపూడి ఐడీఏలో యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జీజీహెచ్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన 60 మంది కంపెనీ ఉద్యోగులు, సిబ్బందిని అభినందించారు. సంస్థ జనరల్ మేనేజర్ వసంతరావు, జెమిని ఎడిబుల్స్ జీఎం గురుప్రసాద్, మైండ్ ట్వీట్ సీఈవో డాక్టర్ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై ఆకతాయిల దౌర్జన్యం

సామర్లకోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేట్లపాలెం కొండపల్లి గంగన్న మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు జి.మేడపాడు నుంచి వచ్చిన బాలికలపై ఆకతాయిలు వేధింపులకు పాల్పడ్డారు. వారిని పరీక్షా కేంద్రానికి వెళ్లకుండా ఆటోను అడ్డగించగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తక్షణం స్పందించి ఆకతాయిలను నిరోధించారు. పాఠశాల వద్ద బాలికలపై ఆకతాయిలు చేస్తున్న దౌర్జన్యాలపై స్థానికులు మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదని పలువురు ఆరోపించారు. పోలీసు ఉన్నతాధికారులు సత్వరం స్పందించి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు సురేష్ (పాత చిత్రం)

సామర్లకోట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదబ్రహ్మదేవం జోడు నాదాలు సమీపాన సోమవారం ఉదయం రైల్వే ట్రాక్ దాటుతుం డగా గుర్తు తెలియని రైలు వేగంగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడుకి చెందిన టీడీపీ నాయకుడు, వెలంపాలెం నీటి సంఘం అధ్యక్షుడు వల్లూరి సురేష్(49)గా గుర్తించారు. ఒక ఫైనాన్స్ సంస్థలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్న ఇతడు విధి నిర్వహణలో భాగంగా పెదబ్రహ్మదేవం సమీపంలోని ఇళ్లపల్లిపాకలు గ్రామానికి మోటారు సైకిలుపై బయల్దేరాడు. మార్గమధ్యంలో లఘుశంఖ తీర్చుకునేందుకు ట్రాక్ దాటుతుండగా అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చి రైలు ఢీకొనడమే కాక సుమారు 200 మీటర్ల దూరం లాక్కెళ్లింది. దీంతో వ్యక్తి శరీరం గుర్తించలేని రీతిలో నుజ్జునుజ్జు అయిందని రైల్వే పోలీసులు చెప్పారు. సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా మృతదేహం పడి ఉన్న ప్రదేశాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పెద్దాపురం తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. సామర్లకోట రైల్వే ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో....

రావువారిచంద్రంపాలెం వద్ద సోమవారం ట్రాక్ దాటుతుండగా వెనుక నుంచి రైలు ఢీకొనడంతో సుమారు 35 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే కీమెన్ అందించిన సమాచారంతో రైల్వే ఎస్ఐ వాసు సిబ్బందితో కలిసి సంఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు చెప్పారు.



సీఎం చంద్రబాబును కలిసిన మాజీ మంత్రి చిక్కాల

కాకినాడ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిక్కాలకు సీఎం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కాజులూరు మండలంలోని కూరాడ మీడియం, ఆవ మైనర్ డ్రెయిన్లను ఆధునికీకరించాలని సీఎంను కోరారు. ఈ డ్రెయిన్లు తవ్వేందుకు గతంలో రూ.1.30 కోట్లతో అంచనాలు రూపొందించారని వివరించారు.



వైభవంగా గంగాలమ్మ తల్లి నూతన ఆలయ శిఖర ప్రతిష్ఠ

సర్పవరం జంక్షన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలో గంగాలమ్మ అమ్మవారి నూతన ఆలయ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. తొలుత వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక హోమం, మహా పూర్ణాహుతి, గోదర్శనం, వేద ఆశీర్వచనం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం జరిపారు. నిర్వాహకులు, దాతలు, గ్రామ పెద్దలు, పూజారులు పాల్గొన్నారు.

'సదుపాయాలు కల్పించాలి'

కాకినాడ సిటీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డెయిరీఫారమ్ ఏరియా నూకాలమ్మ మాన్యం కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో సదుపాయాలు కల్పించాలని 12వ డివిజన్ నూకాలమ్మ మాన్యం ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌తో పాటు కార్పొరేషన్ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. నూకాలమ్మ జాతర మహోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు అత్యవసరంగా చేపట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రహరీ చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయించి రంగులు వేయించాలన్నారు. జాతర జరిగే రోజుల్లో ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించి ఆరోగ్యకర వాతావరణం కల్పించాలని కమిటీ సభ్యులు తుమ్మల రమేష్, కశింకోట చంద్రశేఖర్, లావేటి అప్పారావు తదితరులు కోరారు.

రీ సర్వేపై సమీక్ష

పెద్దాపురం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ రీ సర్వేపై అసిస్టెంట్ కలెక్టర్ భావన సోమవారం సమీక్షించారు. డివిజన్ పరిధిలో రీ సర్వే చేస్తున్న 11 మండలాల రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లకు ఆమె పలు సూచనలు చేశారు. గతంలో రీ సర్వే చేసిన సమయంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా రీ సర్వే చేయాలని ఆదేశించారు. సందేహాలను నివృత్తి చేశారు. ఆర్డీవో శ్రీరమణి, 11 మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

కరపలో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

కరప, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కరపలో సోమవారం సీపీఎం ప్రజా చైతన్యయాత్ర జరిగింది. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రాజశేఖర్, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ రమణి, చీకట్ల వెంకటలక్ష్మి, గ్రామస్తులతో కలిసి నక్కావారిపేట, పల్లపు, గంటాలమ్మగుడి వీధుల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను గుర్తించి స్థానికులతో మాట్లాడారు. సమస్యలపై వినతిపత్రాన్ని గ్రీవెన్స్‌సెల్‌లో ఎంపీడీవో అనుపమకు అందజేసి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు రాజశేఖర్ తెలిపారు. బల్లి లక్ష్మి, సూరిబాబు, వీరవేణి, దుర్గ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

తుని రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం దిగువన లోవ కొత్తూరు గ్రామంలో సుందరంగా రూపుదిద్దుకున్న నూకాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం జరిగింది. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అన్నదానాన్ని భక్తులు స్వీకరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పదో తరగతి పరీక్షలు ప్రారంభం




రంపచోడవరం: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో, రాజవొమ్మంగి: పరీక్ష రాసేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న విద్యార్థిని దేవి

రంపచోడవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పరిశీలించారు. విద్యార్థులు ఇబ్బందులకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయన వెంట ఏటీడబ్ల్యువో రామతులసి ఉన్నారు.

దేవీపట్నం, (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ముసినికుంటలో ఉన్న దామనపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల పరీక్షా కేంద్రంలో ఇందుకూరుపేట, కొత్తవీధి, దేవీపట్నంలోని పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాశారు. 187మంది విద్యార్థులకు 187మంది పరీక్షలు రాసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈపరీక్షా కేంద్రాన్ని డీఈవో మల్లేశ్వరరావు, తహశీల్దార్ కె.సత్యనారాయణ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వై.రామవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్షకు యార్లగడ్డ పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. ఈకేంద్రంలో యార్లగడ్డ, పనసలపాలెం, దాలిపాడు ఆశ్రమ పాఠశాలలు, వై.రామవరం జడ్పీస్కూల్, తోటకూరపాలెం కేజీబీవీ, వెదురునగరం గిరిజన వికాస కేంద్రాల నుంచి 164మంది పరీక్ష రాయాల్సి ఉండగా 163మంది పరీక్ష రాసినట్లు ఎంఈవో-2 వెంకటరమణ తెలిపారు. వై.రామవరం జడ్పీ స్కూల్ నుంచి ఒక విద్యార్థి అనారోగ్యం కారణంగా పరీక్షకు హాజరుకాలేదని తెలిపారు. మండల ఎగువ ప్రాంతం డొంకరాయి పదో తరగతి పరీక్షా కేంద్రంలో 66మంది విద్యార్థులకు 65 మంది పరీక్షకు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈవో-2 వెంకటరమణ తెలిపారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేఎన్‌పురం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలతో పాటు గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 296మంది విద్యార్థులకు తొలిరోజు ముగ్గురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. రెండు పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీటి వసతి, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాగా టీడీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కణితి మధు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఎటువంటి భయం, ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు.

రాజవొమ్మంగి, (ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోన్న అంగవైకల్యం విద్యార్థిని గెమ్మెల దేవి పదో తరగతి పరీక్షకు హాజరైంది. తాను నిస్సహాయ స్థితిలో ఉన్నానని తెలిసి కూడా దృఢ సంకల్పంతో పరీక్షకు హాజరైంది. ఆ విద్యార్థిని పరీక్ష రాసేందుకు అంగవైకల్యం అడ్డురావడంతో దేవి ప్రశ్నలకు సమాధానం చెపుతుంటే అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతోన్న ఎస్.కుసుమ పరీక్ష రాసిందని హెచ్ఎం నాగసుశీల తెలిపారు. రాజవొమ్మంగి మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షకు 459మంది విద్యార్థులు పరీక్ష రాయగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో సూరయ్యరెడ్డి తెలిపారు. రాజవొమ్మంగి హైస్కూల్, జడ్డంగి బాలికల ఆశ్రమ పాఠశాల, రాజవొమ్మంగి బాలుర ఆశ్రమ పాఠశాల, సింగంపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అన్నిసౌకర్యాలు కల్పించామన్నారు.

మోతుగూడెం, (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి జిల్లా పరిషత్ పాఠశాల పరీక్షా కేంద్రంలో మంగంపాడు ఆశ్రమ బాలుర హైస్కూల్ విద్యార్థులు 31 మంది, ఆశ్రమ పాఠశాల బాలికలు 15 మంది, డొంకరాయి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 20మంది విద్యార్థులు మొత్తంగా 66 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

అడ్డతీగల, (ఆంధ్రజ్యోతి): అడ్డతీగలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇక్కడ రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 364మంది విద్యార్థులకు 363మంది పరీక్ష రాయగా ఒకరు గైర్హాజరయ్యారు. సీఎస్‌గా గోపాలకృష్ణ, డీవోగా ఎం.రామారావు విధులు నిర్వహించారు.

గిరిజనేతరుల శాశ్వత గృహ నిర్మాణాలు ఆపాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాల పీసా కమిటీలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. గిరిజన ప్రాంతంలో చట్టవిరుద్ధంగా భూఆక్రమణలు చేసిన గిరిజనేతరులకు నోటీసులిచ్చి తొలగించాలన్నారు. కులధ్రువీకరణ పత్రాలు జారీ చేసేటప్పుడు పీసా వారు పత్రాలు పరిశీలనకు అవకాశం ఇవ్వాలని, భూ అమ్మకాలు, కొనుగోలు పీసా వారికి తెలిజేయాలని, గిరిజనేతరులకు భూపట్టా ఉన్నా శాశ్వత గృహాలు నిర్మాణాలు నిలిపివేయాలని, శాశ్వత గృహాలు నిర్మిస్తే నోటీసులు ఇచ్చి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రతీ గ్రామపంచాయతీలో గ్రామంలో ఉన్న గిరిజన కుటుంబాల ఇంటి పేర్లను జాబితా రూపంలో నోటీస్‌బోర్డు ఏర్పాటుచేయాలన్నారు.

పోలవరం అడ్మినిస్ట్రేటర్‌ను కలిసిన సర్పంచ్ రాజామణి



అడ్మినిస్ట్రేటర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సర్పంచ్ రాజామణి

దేవీపట్నం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం భూసేకరణ కార్యాలయంలో పోలవరం అడ్మినిస్ట్రేటర్ అభిషేక్‌ను సోమవారం దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, తెలుగు యువత అధ్యక్షుడు లంక హరిశ్చంద్రుడు కలిశారు. ముందుగా అడ్మినిస్ట్రేటర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలో 44 గ్రామాల నిర్వాసితుల సమస్యలపై వినతిపత్రం అందించారు. దేవీపట్నం గ్రామానికి సంబంధించి కోర్టులో ఉన్న తొమ్మిది ఎకరాల భూమి నిర్వాసితులకు అప్పగించి గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. గిరిజన, గిరిజనేతర రైతుల భూమికి నష్టం పరిహారం, 18ఏళ్లు నిండిన వారికి ఆర్అండ్ఆర్ ఇవ్వాలని కోరారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 82 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

రంపచోడవరం, మార్చి 17(ఆంధ్ర జ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 82 అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, ఏపీవో(జీ) డీఎన్వీ రమణతో కలిసి అర్జీలను స్వీకరికంచారు. స్వీకరించిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మండయ్య, షరీఫ్, ఏడీఎంహెచ్‌వో శిరీష, తహశీల్దారు పి.రామకృష్ణ, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ దొర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల మందలింపుతో పురుగులు మందు తాగి బాలిక మృతి

రాజవొమ్మంగి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు వెళ్లి వచ్చాం కనీసం వంట కూడా చేయకపోతే ఎలా అని కుమార్తెను అన్నందుకు గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. జడ్డంగి అడిషనల్ ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం. అమినాబాద్ పంచాయతీ ఏటీ కాలనీ గ్రామానికి చెందిన రావుల వీర్రాజు భార్యతో కలిసి ఈనెల15వతేదీన ఉపాధి హామీ పనికి వెళ్లి వచ్చారు. అయితే ఇంట్లో ఉన్న వారి కుమార్తె సంధ్యాన ప్రియ(19)ను కనీసం వంట కూడా చేయకపోతే ఎలా అని అన్నందుకు ఆమె అదే రోజు రాత్రి గడ్డి మందు తాగింది. మరుసటి రోజు ఆదివారం చర్చికి ప్రార్థనకు వెళ్లి అక్కడ వాంతులు చేసుకోగా అందరూ అడగడంతో గడ్డి మందు తాగానని చెప్పింది. వెంటనే ఆమెను జడ్డంగి పీహెచ్‌సీకి తరలించి అక్కడి ప్రాథమిక చికిత్స చేసి కాకినాడ జీజీహెచ్‌కు మెరుగైన వైద్యం నిమిత్తం సిఫార్సు చేశారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని, తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు



కిర్లంపూడి గెద్దనాపల్లి ప్రభుత్వ పాఠశాలలో రూమ్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

గండేపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం తొలి రోజు ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవో నాయక్ తెలిపారు. మల్లేపల్లి, గండేపల్లి, తాళ్లూరు హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 495 మంది విద్యార్థులకు 488మంది హాజరుకాగా 7గురు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాలను ఎంపీడీవో నాతి బుజ్జి పరిశీలించి విద్యార్థులను సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో 5పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. లింగంపర్తి జడ్పీ హైస్కూల్, ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, బాష్యం హైస్కూల్, శ్రీవిద్య స్కూల్‌ల్లో 931 మందికి 919మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో బి.అబ్బాయి తెలిపారు. ఛీఫ్ సూపరిడెంట్లుగా బాచాయ, కళ్యాణ్, నాగరాజు,గణపతిరావు,లక్ష్మీ తులసి వ్యవహరించారు.

కిర్లంపూడి: మండలంలో 7 కేంద్రాల్లో 917 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంది. 910మంది పరీక్షలు రాయగా ఏడుగురు గైర్హాజరైనట్టు ఎంఈవో టి.జోసెఫ్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

శంఖవరం: మండలంలో 4 కేంద్రాల్లో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్టు ఎంఈవో ఎన్వీ రమణ తెలిపారు. కత్తిపూడి ఉన్నత పాఠశాల, శంఖవరం ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, అన్నవరం దేవస్థానం పాఠశాలలో జరిగిన పరీక్షలకు 774మంది విద్యార్థులకు 767మంది హజరైనట్టు ఆయన పేర్కొన్నారు.

జగ్గంపేట: మండలంలో 5 సెంటర్లలో 1127 మందికి 1118 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. తొమ్మిదిమంది గైర్హాజరయ్యారు.

తొండంగి: తొండంగి, దానవాయిపేట, పెరుమాళ్ళపురం, బెండపూడి సెంటర్లలో పరీక్షలు నిర్వహించగా దానవాయిపేట నుంచి ఇద్దరు, పెరుమాళ్ళపురం నుంచి ఇద్దరు, బెండపూడి నుంచి ఒకరు మొత్తం ఐదుగురు గైర్హాజరయ్యారు.

తుని రూరల్: తుని అర్బన్, రూరల్‌లో 12 పరీక్ష కేంద్రాల్లో 2202 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో గీతాదేవి తెలిపారు. విద్యార్థుల అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

ప్రత్తిపాడు: మండలంలో 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రత్తిపాడు, ధర్మవరం, లంపకలోవ, ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టెన్త్ పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ సూర్యప్రభ, ఎంఈవో వి.రాజబాబు తదితర అధికారులు పరిశీలించారు.



ఏలేశ్వరంలో హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

'గ్రామాల అభివృద్ధే లక్ష్యం'

ఏలేశ్వరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. సోమవారం మండలంలోని లింగంపర్తి, తిరుమాలి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మండల పరిషత్ నిధుల నుంచి లింగంపర్తిలో రూ.25 లక్షలతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైకిల్ షెడ్డు సీసీ రోడ్డు నిర్మాణం, డ్రైన్, తిరుమాలిలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి ఎంపీపీ, నాయకులు కొబ్బరి కాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఎంపీడీవో సూర్యనారాయణ, సర్పంచ్ చంద్రలేఖ, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, ఎంపిటిసి సభ్యులు అలమండ నాగు, వరుపుల దుర్గావేణి, సుబ్బరాజు, పెంటకోట మోహన్, చిక్కాల లక్ష్మణరావు, నూకతాటి ఈశ్వరుడు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

జగ్గంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్న క్యాంటీన్‌లో జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి చెందిన దివంగత పంతం కృష్ణారావు కుమారులు పంతం సత్యనారాయణ, పంతం రాజా ఆర్థిక సాయంతో పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై ప్రారంభించారు. కొత్త కొండబాబు, మారిశెట్టిభద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, కన్నబాబు, అడపా భరత్‌బాబు, దొడ్డిపట్ల బుజ్జి, దేవరపల్లి మూర్తి, దాసరి సీతారామకృష్ణ, బోదిరెడ్ల సుబ్బారావు, బద్ది సురేష్, ఎస్వీప్రసాద్, పాలాడి శ్రీను, కోడూరి రమేష్ ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

జగ్గంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం సీతానగరంలో దేవి ఫిషరీష్ సహకారంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. టీటీడీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సోమవారం ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో దేవి ఫిషరీష్ ఆకాష్, మారిశెట్టిభద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, అడపా భరత్, కన్నబాబు, దేవరపల్లిమూర్తి, జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి శివ, బొద్దిరెడ్ల సుబ్బారావు, బద్ది సురేష్, కోడూరి సత్యనారాయణ, ముత్యాల సత్యనారాయణ ఉన్నారు.

తునిలో అగ్నిప్రమాదం

తుని రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా అగ్నిప్రమాదం జరిగింది. సురవరానికి చెందిన వ్యక్తి గోను సంచులు గోడౌన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది సకాలంలో ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.



పారదర్శకంగా ఓటర్ల జాబితా : ఈడీ



ప్రత్తిపాడు సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గ ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ 2025ను పారదర్శకంగా నిర్వహించడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తోడ్పాటునందించాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ, నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహశీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈడీ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రకాశన, భావితరం ఓటర్లను చేర్పించుట, మరణించిన ఓటర్లను గుర్తించుట, పోలింగ్ కేంద్రాల మార్పులు, ఓటర్ల పేరులు సవరణలువంటివి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ల జాబితా సవరణను చేపట్టాలన్నారు. సమావేశంలో సహాయ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎం.సూర్యప్రభ, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్, జనసేన పార్టీల ప్రతినిధులు కొండపల్లి శ్రీనివాస్, సింగిలిదేవ్ సత్తిరాజు, ధర్నాలకోట శ్రీను, మానుకొండ లచ్చబాబు, మొర్త వీరబాబుల, ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్, శంఖవరం తహశీల్దార్‌లు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటుకు చొరవ చూపాలి

మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే దివ్య వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దివ్య

తుని రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం పాత కొట్టాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చొరవ చూపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. సోమవారం అసెంబ్లీలో మంత్రికి ప్రతిపాదిత లేఖను అందజేసి పాత కొట్టాంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు కార్యరూపం ఇవ్వాలని కోరారు. వ్యవసాయ ఆధారిత గ్రామాలైన పాత కొట్టాం, కొత్త కొట్టం, లక్ష్మీదేవిపేట, అల్లిపూడి, ఈఈ చిన్నయ్యపాలెం పూర్తిగా వెనుకబడిన ప్రాంతమని, ఈ గ్రామాలతో పాటు అనకాపల్లి జిల్లా నాతవరం మండలానికి చెందిన మరో ఐదారు గ్రామాల విద్యార్థుల కోసం పాత కొట్టాంలో జూనియర్‌కాలేజ్ ఏర్పాటు చేయవల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి ఏడాది 700 నుంచి 800 మంది విద్యార్థులు టెన్త్ ఉత్తీర్ణత సాధిస్తుంటారని, ఆర్థిక స్థోమత లేని గ్రామీణ విద్యార్థులు డ్రాప్ అవుట్స్‌గా మిగిలిపోతున్న విషయాన్ని వివరించారు. అందువల్ల పాత కొట్టాంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి ఎస్టిమేట్స్, ప్రతిపాదనలతో కూడినలేఖను మంత్రికి ఆమె అందజేశారు.

బావిలో పడి మహిళ మృతి

కోటనందూరు, మార్చి 17(ఆంధ్ర జ్యోతి): కోటనందూరు మండలం బీమవరపుకోట గ్రామ శివారులో బావిలో ఓ మహిళ ప్రమాదవశాత్తుపడి సోమవారం మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పూలపూడి రేవతి బావిలో నీళ్ల తోడుతుండగా ప్రమాదవశాత్తు పడిపోయింది. వెంటనే స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు తెలియజేశారు. పోలీసులకు తెలియజేయగా ఎస్ఐ టి.రామకృష్ణ, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహన్ని బావిలో నుంచి పైకి తీశారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా అసుపత్రికి తరలించడం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

మహాసేన రాజేష్‌కు పరామర్శ

ప్రత్తిపాడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పితృ వినియోగానికి గురైన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్‌ను సోమవారం రాత్రి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎస్ వర్మ పరామర్శించారు. ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామానికి విచ్చేసి రాజేష్ తండ్రి సాధుసుందర్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజేష్‌ను ఏపీసీఆర్పీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్, మండల కమిటీ అధ్యక్షుడు కోడి శ్రీనివాస్ పరామర్శించారు.



రాజేష్‌తో మాట్లాడుతున్న వర్మ

'పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి'



ఉప్పలపాడులో కుళాయికి సీలు వేస్తున్న ఈవోపీఆర్డీ

గండేపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుళాయి, ఇంటి పన్నులు వేగవంతంగా వసూలు చేయాలని మండల ఈవో పీఆర్డీ చంద్రశేఖర్ అన్నారు. ఉప్పలపాడు గ్రామంలో బకాయిలు ఎక్కువగా ఉండడంతో సోమవారం ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గ్రామ సచివాలయ సిబ్బంది, మండల కార్యదర్శులతో కలిసి పన్ను వసూళ్లు చేపట్టారు. మొండిబకాయిలకు ట్యాప్‌లకు సీలు వేయించడంతో పాటు మోటారు ద్వారా నీరు తోడుతున్న మోటార్లను తొలగించారు. ఉప్పలపాడులో 5 నుంచి 8 ఏళ్ల పన్నులు కట్టని బకాయిలు ఉన్నాయని వాటిని వసూలు చేయడానికి వచ్చామన్నారు. ఒక్కరోజులోనే రూ.65వేలు పన్నులు వసూలయ్యాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు వెంకటరామనాథ్, తరంగిణి, సిబ్బంది ఉన్నారు. సింగరంపాలెం కార్యదర్శిగా పనిచేస్తున్న వెంకటరామనాథ్ పన్ను వసూళ్లపై దృష్టిసారించి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ వందశాతం పన్నులు వసూలు చేశారు. ఎంపీడీవో నాతి బుజ్జి అభినందనలు తెలిపారు.

'విద్యార్థులకు రుణాలు'

శంఖవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫార్మశీ చదువుకున్న వెనకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, కాపు సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు బ్యాంకు లోనుతో కూడిన సబ్సిడీ అందజేస్తున్నామని ఎంపీడీవో శర్మ తెలిపారు. సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కులవృత్తులవారికి బ్యాంకు రుణాలు మంజూరుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈనెల 22వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు రేషన్, ఆధార్ కార్డు, కులధృవీకరణ పత్రాలతో సచివాలయంలో కలవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

గండేపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గండేపల్లి ఎంపీడీవో కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి పక్కన సోమవారం చలివేంద్రాన్ని ఎంపీడీవో నాతి బుజ్జి ప్రారంభించారు. బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయ వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ వరకు రోజూ చలివేంద్రాల్లో మంచినీరు, వారానికి ఒకరోజు మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఈవో చంద్రరావు, సిబ్బంది స్వర్ణలలిత, కల్యాణి ఉన్నారు.

మజ్జిగ పంపిణీ

జగ్గంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్డులో గల బాలాజీ జ్యూయలర్స్ ఎదురుగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు హాజరై మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వాసవి గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, కంచర్ల సత్యనారాయణ, బొండా వీర సత్య, శ్రీనివాస్ ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి సంబరం

గండేపల్లి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): మురారిలో శ్రీ గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సంబరం సోమవారం ప్రారంభమైంది. 5రోజుల పాటు గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు కందుల కొండయ్యదొర, కందుల చిట్టిబాబు, భక్తుల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.

బోధనా సామగ్రి అందజేత

తొండంగి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): తొండంగిలో ఉన్న భవిత కేంద్రానికి తుని మండలం ఎస్.అన్నవరం శంకర్ ఫౌండేషన్ అధ్యక్షుడు చోడిశెట్టి త్రిమూర్తి స్వామి రూ.10 వేలు విలువైన బోధనాభ్యసన సామగ్రిని అందించారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలకు మెరుగైన శిక్షణ అందిస్తే సాధరాణ విద్యార్థుల కంటే ఉన్నతంగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు షేక్ బాబ్జి, సుబ్బారెడ్డి, వాసు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

తొండంగి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపురం సమీపంలో జరుగుతున్న కోడి పందేలపై సోమవారం దాడి చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. పనసపాడుకు చెందిన ఎల్ శ్రీనివాసు, శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఎ.సూరిబాబులపై కేసు నమోదు చేసి వారి నుంచి 2 కోడి పుంజులు, 2 కోడి కత్తులు,రూ.15960 స్వాధీనం చేసుకున్నామన్నారు.

15టన్నుల మారుజాతి కలప స్వాధీనం

రాజవొమ్మంగి, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా ఐషర్ వ్యాన్‌లో మారుజాతి కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వ్యాన్‌తో పాటు కలపను స్వాధీనం చేసుకున్నట్లు రాజవొమ్మంగి అటవీ రేంజ్ అధికారిణి ఉషారాణి తెలిపారు. రాజవొమ్మంగి ఫారెస్టు రేంజ్ పరిధిలో పరిమితడక గ్రామ శివారున ఐషర్ వ్యాన్‌లో మర్రివీడు గ్రామానికి చెందిన సీహెచ్ రామకృష్ణ, పరిమితడక గ్రామానికి చెందిన వి.అంజి అక్రమంగా కలప తరలిస్తున్నారని తెలిసి మాటువేసి పట్టుకున్నామన్నారు. ఈవ్యానులో రూ.45వేలు విలువైన15 టన్నులు కలప ఉంటుందన్నారు. దీనిపై కేసు నమోదుచేశామన్నారు.



వ్యాన్‌తో మారుజాతి కలపను స్వాధీనం చేసుకున్న దృశ్యం

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు రమేష్ వర్ధంతి

రంపచోడవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గోదావరి లోయ ప్రతిఘటనోద్యమ నాయకుడు బచ్చెల రమేష్ 7వ వర్ధంతిని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి కె.దూలయ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మార్క్స్ ఏంగిల్స్ భవనంలో నిర్వహించారు. గిరిజనులపై జరుగుతున్న దోపిడి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బచ్చెల రమేష్ పోరాటడారన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు పల్లాల లచ్చిరెడ్డి, కె.బాలురెడ్డి, పీవోడబ్ల్యు నాయకులు పి.అనసూయ, చిలకమ్మ, పీవైఎస్ నాయకుడు కె.మురళీ పాల్గొన్నారు.

నారాయణగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

రంపచోడవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ద్వారక తిరుమల దేవస్థానం దత్తత దేవాలయం రంపచోడవరం నారాయణగిరి శ్రీభూనీలా సమేత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈవో ఎన్వీఎస్ఎస్ మూర్తి, చైర్మన్ సుధాకర్ తెలిపారు. సోమవారం విఘ్నేశ్వరుని బియ్యం కట్టుట, పసుపు దంచుట కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, అన్నవరం దేవస్థానం బోర్డు మాజీ సభ్యురాలు కారుకోడి పజ, విశ్వహిందూ పరిషత్ కార్యవర్గసభ్యులు నల్లమిల్లి వెంకట రామారెడ్డి, అర్చకులు అద్దంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



తహశీల్దార్‌కు వినతిప్రతం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అడ్డతీగల, మార్చి 17(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విశ్రాంత ఉద్యోగులు సోమవారం తహశీల్దార్ సూర్యారావుకు వినతిపత్రం అందించారు. 12వ పేకమిషన్ ఏర్పాటు చేసి, ఐఆర్ ప్రకటించాలన్నారు. డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆ సొమ్ములు తీసుకోకుండా విశ్రాంత ఉద్యోగులు చాలా మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్‌సీ నూతన విధానాన్ని వద్దని, పాత విధానం పునరుద్ధరణ చేయాలని కోరారు. వయో వృద్ధులైన తమ సమస్యలు పరిష్కరించి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని సీఎం చంద్రబాబును విశ్రాంత ఉద్యోగులు కోరారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సూర్యకాంతం, జనరల్ సెక్రటరి ఆకిరి రామారావు, ట్రెజరర్ బాలయోగి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.